ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
మే 8, 2011

ENTERED
ENTERED



'హైస్పీడ్' చైనా

హ్యాపీబర్త్‌డే

(2011 మే 8 నుంచి
2011 మే 14 వరకు)

ఎం. లతిక(గంగ)
1సం॥, మే-2010
సంగీత-లాల్‌సింగ్
మహేశ్వరం-రంగారెడ్డి

బి. రోహిత్
2సం॥, మే-8
రాజేశ్వరి-గౌరినాయుడు
పురిటిపెంట-విజయనగరం

వై. సాత్విక
మే-8
విజయ-కృష్ణ
బాగ్‌లింగంపల్లి-హైదరాబాద్

పి. రోహిణి
2సం॥, మే-8
భారతీదేవి-ప్రసాదరావు
మాధవధార-విశాఖ

పి. జోషిత
4సం॥, మే-9
భాగ్యదీప్తి-సీతారామగుప్త
నందిగామ-కృష్ణా



కె. వెంకట్‌శివాజి
2సం॥, మే-10
ఝాన్సీబాయి-వెంకోజిబాబు
నరసరావుపేట-గుంటూరు

జి. సృజనిక
2సం॥, మే-11
కల్పన-సుగుణరాజు
బనగానపల్లె-కర్నూలు

సి. యశస్వి నందిని
2సం॥, మే-12
శాంతి-సోమశేఖర్
భగత్‌సింగ్‌నగర్-ప్రకాశం

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కలర్ ఫొటో జతచేయడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1,
ఎం.హెచ్ భవన్
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email-
venkateshcartoon@gmail.com

సారిక నిర్మల
11సం॥,మే-8
సన్యాసమ్మ-అప్పారావు
రాబంద-విజయనగరం

పి. వినీల
3సం॥,మే-8
పుష్పలత-విజయశేఖర్
కోవలకుంట్ల-కర్నూలు

మనలో మాట

కడప కింగులు

అను సూపర్ యాక్షన్, ఫ్యాక్షన్ సినిమా



ఎవరైనా తెలివైన నిర్మాత కొంత శ్రద్ధ పెడితే.... పైసా ఖర్చు లేకుండా ఓ బ్రహ్మాండమైన భారీ సినిమా రెడీ చేసేయొచ్చు! భారీ తారాగణం.... అదరగొట్టే నటనా చాతుర్యం... టైమ్లీ రియాక్షన్లూ... పవర్‌ఫుల్ డైలాగులు... ఎవరినీ అరేంజ్ చేయక్కర్లేదు. డైలాగు రచయితలక్కర్లేదు. డైరెక్టర్లక్కర్లేదు. 'మహానటులంతా' ఎవరికి వారే వరుస క్రమంలో వచ్చేసి, ఎవరి జనాన్ని వారే తెచ్చేసి, ఎవరి డైలాగులు వారే రుబాబుగా చెప్పేసి వెళ్లిపోతారు. కాకపోతే- రీళ్లు మాత్రం టన్నులకొద్దీ ఉండాలి. తరువాత జాగ్రత్తగా ఎడిట్ చేసుకోవాలి. సినిమా పేరు కచ్చితంగా 'కడప కింగులు' అనో, 'గర్జనలూ గాండ్రింపులూ' అనో పెట్టుకోవాలి!

ఇది సెంటిమెంటూ, ఫ్యామిలీ డ్రామా పుష్కలంగా ఉన్న కథ. ఒకాయన మీసం మెలేసి, తొడ చరుచుకుంటూ వీరావేశంతో డైలాగులు చెబుతాడు. ఇంకొకాయన 'మీ గుండెల్లో నిద్ర పోతా... మీ నట్టింట్లో నిలబడతా...' అంటాడు. ఆపైన గర్జనలూ గాండ్రింపులూ ... మధ్యమధ్యలో రాళ్లూ, రప్పలూ, కత్తులూ, కొడవళ్లూ, కోడిగుడ్లూ గాల్లో ఎగురుతూ కనిపిస్తాయి. జనాల మధ్య వికటాట్టహాస ఆటవిక విన్యాసాలు గట్రా సరేసరి. వాటికి ఈలలూ గోలలూ. ఇందులో సద్యోజనిత మెంత అద్దె జనితమెంత అని మాత్రం అడక్కండి.

ఇక సినిమాలో కామెడీ కూడా ఉన్నట్టే! వదినకు నమస్కరించి, అబ్బాయిని ఆశీర్వదించి- వాళ్లకు ప్రత్యర్థిగా ఉంటాడు బాబాయి. 'మా వాళ్లు గెలిస్తే ఏంటి? ఓడితే ఏంటి? చివరికి అంతా మనదే' అంటూ ముందే తనవాళ్ల గుండెల్లో గుబులు పుట్టిస్తాడు ఓ హస్తం 'ముఖ్య' నేత! ఇంతలో ఒకాయన వెరైటీగా జనానికి ముద్దులు విసురుతాడు. రొమాన్సుకూ లోటులేదన్నమాట. నవరసాలూ ఉండాలికదా!

కడప గడపలో ఇప్పుడు కళ్లకు కడుతున్న రాజకీయ వి'చిత్ర'మిది! ఈ రాజ్యంలో ఇప్పటివరకూ ఓటెరగని వారు బోలెడు మందట. ఓటర్లకు పోలింగ్ బూత్ వరకూ వెళ్లి ఓటేసే కష్టం లేకుండా- కొందరే అందరి ఓట్లూ వేసేసే రాజరికం ఇప్పటిదాకా అక్కడ నడిచిందట! ఎన్నికల సంఘం మాజీ సలహాదారు కెజె రావు ఆ రాజ్యాన్ని సందర్శించి, తేల్చి చెప్పిన సత్యమిది! దీంతోపాటు ఇక్కడ ఎన్నికల ఖర్చు రూ.500 కోట్లు అని అంచనాగట్టి చెప్పారు. అంచనాకు అందనిది మరెంతో...ధనమూ, నటనా వైదుష్యమూ కలగలిసి పారుతున్న ఈ రాజ్యంలో- గనులకు, ఘనులకూ కొదవలేదు.

★

ఈ సంచికలో....

టపా	...	2
కొత్త పుస్తకాలు	...	6
నవ్వుల్ పువ్వుల్	...	7
వికాసం	...	10
రుచి	...	11
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
కథ	...	18
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...

ఈ పేజీ ... 4

వేసవి విజ్ఞాన వినోదాలు
చిన్నారి 'సైట్లు'

సినిమా కబుర్లు ... 8

ఇక్కడ చేయలేనివి
అక్కడ చేయగలుగుతా!

ఆరోగ్యం ... 20

వైద్యప్రయోగాల
విజ్ఞాన సర్వస్వం
ద కాక్రేన్ లైబ్రరీ

అభినందనలు

'అట్టమీది కథ' ఆసక్తిదాయకంగా ఉంది. 'బాలనేస్తాలు' పేజీలు మంచి కాలక్షేపాన్నిస్తున్నాయి. 'రాజకుటీరాలు' కనువిందుచేస్తూ భూలోక స్వర్గంలా కనిపించాయి. 'సినిమా కబుర్లు' విభిన్నమైన విశేషాలతో ఆకట్టుకుంది. శాంతిశ్రీ 'మన్నెంలో...' కథ, 'గొలుసు' చిన్న కథ బాగున్నాయి. 'అమెరికా అనుభవాలు' అందిస్తున్న రావెల సాంబశివరావుకి అభినందనలు. 'ఈ పేజ్' ఉపయుక్తమైన అంశాలతో ఆకట్టుకుంటోంది. 'తెలుసుకుందామా' చదివాక పశు వైద్యులందరికీ ధన్యవాదాలు తెలియజేయాలనిపించింది. 'నవ్వుల్ – పువ్వుల్' ఇంకా హాస్యరసాన్ని అందించాల్సి ఉంది. కవితలన్నీ భావగర్భితంగా ఉంటున్నాయి. 'మనలో మాట' హృదయాన్ని కదిలించింది. సినిమాలు, టీవీ సీరియళ్లు, బయట మృగాళ్లు అందరూ 'స్త్రీ'ని అన్ని రకాలుగా నిర్వీర్యుల్ని చేసి బాధపెట్టేవారే. ఇది మారాలి.

నేమాన సుభాష్‌చంద్రబోస్,
శ్రీకాకుళం.

కనువిప్పు కలిగించేలా...

'దివాళారాజ్యం – వెడ్డింగ్ వైభోగం' బాగుంది. దేశం ఆర్థిక మాంద్యంలో కొట్టుకుపోతుంటే సంక్షేమ పథకాల్లో కోత విధిస్తున్నారు. అదే సమయంలో బ్రిటీష్ యువరాజు పెళ్లిని అట్టహాసంగా, ఆడంబరంగా నిర్వహించడం చాలా హాస్యాస్పదంగా ఉంది. ఉద్యోగులకు సెలవు ఇవ్వడం వల్ల నష్టం లేనప్పటికీ మామూలు శ్రామికుల, నిరుద్యోగుల ఆదాయం, సమయం వృధా అవుతుంది. ప్రజలతో సంబంధం లేని, అనధికార లాంఛనప్రాయ కార్యక్రమానికి అంత ఖర్చు పెట్టడం దండగ. ఆ డబ్బుతో ఏదైనా ప్రజా సంక్షేమ కార్యక్రమం చేపడితే రాజకుటుంబాలకి గౌరవంగా ఉండేది. 'తెలుసుకుందామా, ఈ పేజ్' వ్యాసాల ద్వారా విలువైన సమాచారాన్ని తెలుసుకున్నాం. 'కవిత'లు ప్రయోజనాత్మకంగా, ఆలోచించజేసేవిగా ఉన్నాయి. 'నవ్వుల్ పువ్వుల్, బాల నేస్తాలు, వికాసం బావుంటున్నాయి. చిన్న కథ 'గొలుసు' కనువిప్పు కలిగించేదిగా ఉంది. 'సినిమా కబుర్లు' కొత్త కొత్త విషయాలను అందిస్తోంది. శాంతిశ్రీ 'మన్నెంలో...' కథలోని ఆవేదన అర్థమౌతోంది.

భైరి సత్యనారాయణ, కొత్తగూడెం.

అలరించిన అమెరికా విశేషాలు

'అమెరికా అనుభవాలు' అలరించాయి. పియోరియా, చికాగో, లాండ్ ఆఫ్ లింకన్ స్థలాలు, డౌన్ టౌన్ నిబంధనలు, అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ విశేషాలు తెలుసుకున్నాం.

నూతి నారాయణరావు,
గడ్డిఅన్నారం.

సైన్స్ వ్యాసాలు ఇస్తే...

మనలో మాట వాస్తవానికి అద్దం పట్టింది. భ్రూణ హత్యలు, మహిళలపై దాడులు నానాటికీ పెరుగుతున్నాయి. ఈ విష సంస్కృతిని నిర్మూలించడానికి ప్రజలు ఉద్యమించాలి. కవర్ స్టోరీ బాగుంది. దేశంలో ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా ప్రజలు ఏమైపోయినా వారికి పట్టదు. వారికి రాజభోగాలు, విలాసాలు మాత్రమే కావాలి. 'వికాసం'లో సంతోషంగా జీవించడం ఎలా? అంశం, కవితలు బాగున్నాయి. ఇందులో ఆరోగ్యానికి సంబంధించిన సైన్స్ వ్యాసాలు ప్రచురిస్తేనే బావుంటుంది.

టి. శ్రీరామ్మూర్తి, గాజువాక.

ఆ రోజు వచ్చేనా!

పాటల రచయిత భాస్కరభట్ల రవికుమార్ అనుభవాలు బాగున్నాయి. పశువైద్యాధికారులకు అభినందనలు. మహిళలు అర్ధరాత్రి నిర్భయంగా నడిచిన రోజున నిజమైన స్వతంత్రం వస్తుందని గాంధీ అన్నారు. మరో వంద సంవత్సరాలైనా వస్తుందనే నమ్మకం కలగడం లేదు. 'చూద్దామా'లో రావెల సాంబశివరావు అమెరికా యాత్ర విశేషాలు బాగున్నాయి. రాజ కుటీరం చిత్రాలు చూసి వారెవ్వా అనుకోవాల్సిందే.

వాస్తు రామచంద్ర, రాంజీనగర్.



అక్షర జలపాతాలు

తెలుగు చిత్ర సీమలోఆధునిక కుసుమపరాగ సుగంధాన్ని ప్రేక్షకుల హృదయాల్లో నింపుతున్న భాస్కరభట్ల చెప్పిన మాటలు మాకెంతో నచ్చాయి. ఆయన రచనల్లో వచ్చిన గీతాలన్నీ అక్షర జలపాతాలే. బాల్యానికి భరోసా కవిత బాగుంది.

టి.వి.డి.ఎన్. సీతారామారావు,
విజయవాడ.





SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...
ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

రోజుకు ఒక గంట చాలు...
సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

K.V.R. B.Com.,B.L., (Director)

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

ప్రక్కనవున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:

CHENNAI:
0-97890 99589

ఫోన్: లేదా మీ అడ్రసుకు కోర్స్ మెటీరియల్ పంపమని **SMS** చేయండి

కోర్సు ఫీజు రూ.1,000/-లు. పై టెలిఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం, ఊరి పేరు, పిన్‌కోడ్‌లతో వివరంగా మీ అడ్రసును SMS ద్వారా పంపండి. ఒక వారంలో పోస్ట్‌మేన్ కోర్సు ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1,000/-లు చెల్లించి కోర్సు పొందవచ్చును. మీకు ఏమైనా సందేహాలు ఉంటే పై నెంబరుకు ఫోన్‌చేసి తెలుగులోనే మాట్లాడవచ్చు.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O CHENNAI

KVR INSTITUTE TM

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

....Pin Code: [| | | | |]

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:** 93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside: Kaveri Restaurant, WyraRoad, **Cell:** 94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:** 98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:** 9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near: Telephone Exchange. **Ph:** 228800, **Cell:** 9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex, D.I.Road, **Ph:** 232502. **Cell:** 98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:** 93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:** 99855 01587. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:** 93904 95239, 99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:** 93473 53709, 92900 91456.

ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

వేసవి విజ్ఞాన వినోదాలు
చిన్నారి 'సైట్లు'

ఇంట్లో కంప్యూటర్ వుంటే చాలు. చిన్నారుల దృష్టంతా కంప్యూటర్ గేమ్స్ మీదే. ఆకలిదప్పికలుండవు. గంటల తరబడి దాని ముందే. 'ఫర్వాలేదులే. దెబ్బలు తగిలించుకుంటారన్న బెంగలేదు. హాయిగా ఆడుకుంటారు' అనుకోవచ్చు పెద్దలు. 'కంప్యూటర్, ఇంటర్నెట్ వంటి సాంకేతిక విషయాల పట్ల పిల్లలు సైతం అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందికదా' అని సరిపుచ్చుకోవచ్చు. అయితే చిన్నారుల మెదడును మరింత చురుగ్గా తయారు చేసే... కథల పట్ల ఆసక్తిని కలిగించే... లెక్కలు, సైన్స్ అంటే ఉన్న భయాన్ని పోగొట్టే... పజిళ్ల పని పడుతూ కేరింతలు కొట్టించే అవకాశం కంప్యూటర్‌లో వుంటే....! వుంటే కాదండీ! వుంది. అచ్చంగా పిల్లలకోసం రూపొందించిన సైట్లలో విహరిస్తే సరి. కంప్యూటర్‌లోనే బొమ్మలకు రంగులద్దొచ్చు. చుక్కలు కలపొచ్చు. పజిళ్లు చేయొచ్చు. కథలు వినొచ్చు. చూడొచ్చు. రాయొచ్చు. దర్శనీయ స్థలాల గురించి తెల్సుకోవచ్చు. క్రికెట్-చెస్ నేర్చుకోవచ్చు. ఇలాంటివి ఎన్నెన్నో. వినోదానికి వినోదం. విజ్ఞానానికి విజ్ఞానం. వేసవి సెలవుల రూపంలో వచ్చిన ఈ అవకాశాన్ని చిన్నారులు ఎంచక్కా సద్వినియోగం చేసుకోవచ్చు. మరి ఆ సైట్లేవో...అందులో వున్న అంశాలేమిటో ఈ వారం ఈ పేజీలో ప్రత్యేకంగా ... మీ మూ చిచ్చరపిడుగుల కోసం!

వేసవి సెలవులొచ్చేశాయి. ఈ పోటీ ప్రపంచంలో స్కూళ్ళలో, ట్యూషన్లలో గంటలకొద్దీ చదవడం తప్పని సరి అవుతోన్న పిల్లలకు ఇదో ఆటవిడుపు. ఈ సెలవుల్లో ఏదోక కొత్త విషయాన్ని నేర్చుకోవాలనే ఆసక్తి వున్నవారికి పలు అంశాలు నేడు అందుబాటులో వున్నాయి. వాటిలో కంప్యూటర్ – ఇంటర్నెట్ వంటివి ముందువరుసలో వుంటున్నాయి. అందువల్ల పిల్లలు కూడా వీటిపట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. సహజంగానే ఇంటర్నెట్ వినియోగం వల్ల పిల్లల ప్రపంచం విశాలమవుతుంది. తక్కువ సమయంలో ఎక్కువ విజ్ఞానం పెంచుకొనే అవకాశం వుంది. స్పర్శించడం... చూడడం... వినడం... ఏకకాలంలో జరిగే ఈ ప్రక్రియ ఇంద్రియాలకు పని కల్పిస్తుంది. పిల్లల్లో కొత్తకొత్త ఆలోచనలు, తర్కం పెరుగుతాయి. చదవడం, విశ్లేషించడం, సంఖ్యలు, వాటి ఆకారాలు, రంగులు.... ఇలా ప్రతిదీ చూసి తెలుసుకునే అవకాశం వుంది. ఇంటర్నెట్‌లో పిల్లలకు సంబంధించిన పలు అంశాలతో లక్షలాది సైట్లు అందుబాటులో వున్నాయి. వాటన్నిటినీ ఇక్కడ ప్రస్తావించడం లేదు గానీ కొన్ని సైట్ల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం....

చిన్నారులకోసం 'తెలుగు4కిడ్స్'

తమ పిల్లలకు, తెలుగు భాషపై మక్కువ పెంచుతూ... పిల్లల ఉత్సాహమే పెట్టుబడిగా ఎందరో చిన్నారులకోసం 'తెలుగు4కిడ్స్' అనే సైట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ సైట్ తేలికైన పదాలతో రైమ్స్, పద్యాలు, పొడుపుకథలు, చిన్న చిన్న కథలు, వ్యాకరణం, పదాలు, సంఖ్యలు మొదలగువాటిని పిల్లలకు నేర్పిస్తుంది. అదే విధంగా 'బుక్‌బాక్స్' అనే సైట్‌లో కథలను అందమైన బొమ్మలతో, ఒక చిత్రంలా అందించారు. తమ చిన్నారులు తెలుగుభాషని సులువుగా నేర్చుకోవాలని కోరుకునే తల్లిదండ్రులు తప్పక చూడవలసిన సైట్లు ఇవి. http://telugu4kids.com/default.aspx

'గూగుల్ కిడ్స్' - ఒక మంచి యాక్టివిటీ సైట్

'ప్రీ-స్కూల్', 'కిండర్ గార్డెన్' పిల్లలు ఈ వేసవికాలంలో చక్కగా టైంపాస్ చెయ్యటానికి 'గూగుల్ కిడ్స్' సైట్ బాగా ఉపయోగపడుతుంది. ఇక్కడ పిల్లల కోసం చాలా యాక్టివిటీస్ వున్నాయి. ప్రతి దానిని ప్రింట్ చేసుకొనే సదుపాయం కూడా వుంది. ఇక్కడ రైమ్స్, పిక్చర్ కలరింగ్, బొమ్మల మాచింగ్, నంబర్ చార్ట్‌లు, ఆంగ్ల పదాలకు సంబంధించిన ఫ్లాష్ కార్డ్స్, జంతువులపై వ్యాసాలు, బుక్లెట్స్, జంతువులు, పువ్వులు, పండ్లు, కూరగాయలు మొదలగు వాటికి సంబంధించిన ఎక్సర్‌సైజ్‌లు, గ్రీటింగ్ కార్డ్స్, గేమ్స్ యిలా చాలానే వున్నాయి.

'స్టోరీ టైమ్ ఫర్ మి' - ఆన్ లైన్ కథల పుస్తకాలు!

ఈ సైట్‌లో పిల్లల కోసం ఉచిత ఇంటరాక్టివ్ స్టోరీ బుక్స్ ఉన్నాయి. బుక్స్‌ని బ్రౌజర్‌లోనే చదవొచ్చు. కొన్ని పుస్తకాల్లో యానిమేషన్స్ కూడా ఉన్నాయి. పిల్లల్లో కథల పుస్తకాల పట్ల ఆసక్తిని పెంపొందిస్తాయి. చదవవలసిన పుస్తకాన్ని ఎంపిక చేసిన తర్వాత కింద కంట్రోల్ బటన్స్ ఉంటాయి. వాటిని ఉపయోగించి ఆడియో మరియు యానిమేషన్ ని స్టాప్ చేసుకోవచ్చు.

http://www.storytimeforme.com/

యాహూ కిడ్స్

ఈ సైట్ లో పిల్లలకోసం మ్యూజిక్, మూవీ, జోక్స్, ఈ-కార్డ్స్, ఎన్‌సైక్లోపీడియా, హారోస్కోప్, రిఫెరెన్స్ మెటీరియల్ యిలా చాలానే వున్నాయి. పెద్దల కోసం ప్రత్యేక విభాగం కూడా వుంది, ఇక్కడ మూవీ రివ్యూ. ఆన్ లైన్ సేఫ్టీ గురించి పిల్లలకు ఎలా తెలియచెయ్యాలి? వంటివి చాలానే వున్నాయి. http://kids.yahoo.com/

నేషనల్ జియోగ్రాఫిక్ కిడ్స్

ఇక్కడ కథలు, యాక్టివిటీస్, వీడియోలు, జంతువులు, ఆటలు, ఫొటోలు, ఇంకా ఇతర ఎడ్యుకేషనల్ లింకులు వున్నాయి. http://kids.national-geographic.com/kids/

ఫనాలజీ

జోక్స్, ఆర్ట్స్&క్రాఫ్ట్స్, మాజిక్ ట్రిక్స్, వైర్డ్ సైన్స్ సెక్షన్‌లో పిల్లలు చెయ్యగలిగే ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ మొదలగు వాటికి సంబంధించిన ప్రయోగాలు వున్నాయి. నూరూరించే రుచులు యింకా ఎన్నో...
http://funology.com/

ఫన్ బ్రెయిన్

వినోదంతో కూడిన ఎడ్యుకేషనల్ సైట్ ఇది. వెబ్ బుక్స్, కామిక్స్, మెదడుకు పదును పట్టే ఇంటరాక్టివ్ గేమ్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కోసం సలహాలు యింకా చాలా వున్నాయి. http://www.funbrain.com/

పీబీఎస్ కిడ్స్

పిల్లల కోసం గేమ్స్, వీడియోస్, ఈ-కార్డ్స్ యిలా చాలా వున్నయి. బ్యాక్

గ్రౌండ్ మ్యూజిక్ సరదాగా మరియు ఆసక్తికరంగా వుంటుంది.
http://pbskids.org/

ఫిజిక్స్ గేమ్స్

మీ చిన్నారుల తెలివితేటలకు పరీక్ష పెట్టాలనుకుంటే భౌతికశాస్త్ర పాఠాలతో www.physicsgames.net సిద్ధంగా ఉంది. కొలైడర్, గ్రావిటీ మాస్టర్, ఐక్యూ బాల్, 99 బ్రిక్స్... లాంటి ఆటలున్నాయి.

గణితంతో ఆటలు

గణితంతో ఆడుకోవాలంటే www.brain-fun.comలోకి వెళ్లండి. మెదడుకు పదును పెట్టే బోలెడు పజిల్స్ జవాబులతో సహా సిద్ధం.

చదరంగం సైట్

చదరంగం అంటే ఇష్టముంటే www.chess.com సర్వీసులో సభ్యులైపోండి. ఇదో చెస్ కమ్యూనిటీ. మొత్తం సభ్యుల సంఖ్య 32,66,448. మెయిల్ ఐడీ, ఫేస్‌బుక్ ఐడీ ద్వారా లాగిన్ అవ్వొచ్చు. స్నేహితులతో ఆన్‌లైన్‌లో ఆడొచ్చు. 'లెర్న్ చెస్'తో మెలకువలు నేర్చుకోవచ్చు. చెస్ చరిత్ర, ఆట నియమాలు, ఎత్తుల్ని తెలుసుకోవచ్చు. 'చెస్ వీడియో'ల్లో ప్రముఖుల ఆటల వీడియోలను చూడొచ్చు. 'టోర్నమెంట్స్' ద్వారా పోటీల్లో పాల్గొనొచ్చు. 'మొబైల్ చెస్'తో మీ మొబైల్‌లోకి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

'బౌల్డ్' చేస్తారా?

క్రికెట్ బౌలింగ్‌ను ఆన్‌లైన్‌లో కూడా చేయవచ్చని తెలుసా? అదే 'బౌల్ అవుట్ గేమ్'. ఆరు బంతుల్లో మూడు వికెట్లు పడాలి. కింద మీటర్‌పై కనిపించే బాణం గుర్తుని క్లిక్ చేస్తే ప్లేయర్ బౌలింగ్ చేస్తాడు. బాణం గుర్తు కోణాన్ని క్లిక్ చేయడమే ఆటలో కీలకం. http://goo.gl/a7HOg

ఆన్లైన్ గేమింగ్ సైట్ 'జపక్'

'జపక్' ప్రముఖ ఆన్లైన్ గేమింగ్ సైట్. దీనిలో అద్భుతమైన ఫ్లాష్ గేమ్స్‌ను చాలా సులువుగా ఆడవచ్చు. అయితే చిన్నారుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన సైట్ ఇది. దీనిలో పజిల్స్, స్పోర్ట్స్, రేసింగ్, యాక్షన్, ఫన్స్ తదితర గేమ్స్ అందుబాటులో వున్నాయి. వీటిని ఆడుకోవడానికి సిస్టమ్‌లో చాలా తక్కువ మెమరీ తీసుకుంటుంది కాబట్టి ఎలాంటి సమస్యా లేకుండా ఆడుకోవచ్చు. అదేవిధంగా 'వై8' సైట్‌లో కూడా అద్భుతమైన గేమ్స్ పిల్లలను అలరిస్తాయి. http://kids.zapak.com/, http://y8.com/.

కథల కాణాచి చందమామ

జానపద కథలకు చందమామ కాణాచి. చందమామకు ఉన్నటువంటి గ్రంథాలయం మరెక్కడా లేదు. ఎంతో అద్భుతమైన జానపద కథలు చందమామలో వచ్చాయి. 2000 సం॥ నుండి ప్రతి సంవత్సరం నవంబరు సంచికను పిల్లల ప్రత్యేక సంచికగా రూపొందిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా 14ఏళ్లలోపు బాలబాలికల చేత కథలు రాయించి, ఎంపిక చేసిన బాల చిత్రకారుల్ని చెన్నై రప్పించి, ఆ కథలకు వారిచేత బొమ్మలు వేయిస్తున్నారు. తెలుగు, హిందీ, మరాఠీ, ఒరియా, కన్నడ, బెంగాలీ, తమిళం, మలయాళం, గుజరాతీ, అస్సామీస్, సంస్కృతం, సంతాలీ.. ఇలా 12 భాషల్లో చందమామ క్రమం తప్పకుండా ప్రచురితమౌతోంది. (వీటికి అదనంగా ఇంగ్లీషు చందమామ, జూనియర్ చందమామ - తొమ్మిదేళ్ల వయసు లోపు పిల్లలకు ఇంగ్లీషులో ప్రచురిస్తున్నారు)
http://www.chandamama.com/index.htm





తెలుగు పిల్లల ఇ-ప్రతిక

తెలుగు పిల్లల ఇ-ప్రతికకో ప్రత్యేకత వుంది. ఇది చిన్నారులను చాలా బాగా ఆకట్టుకుంటుంది. పిల్లలు, పెద్దలు రాసే కథలతో పాటు, ఆ కథలకు బొమ్మలను కూడా ఈ సైట్లో వుంచుతారు. ప్రస్తుతం ఈ ప్రతిక రంగురంగుల బొమ్మలతో ఎంతో ఆకర్షణీయంగా పుస్తక రూపంలోనూ వస్తోంది.
http://kottapalli.in/

బాలల డిజిటల్ పత్రిక

బాలల డిజిటల్ పత్రిక జాబిల్లి. చిన్నారుల కథలు, ఆటపాటలు, వ్యాసాలు, కబుర్లు, బొమ్మలు ఇలా ఏవైనా బాలల సృజనాత్మక సృష్టిని ఇక్కడ పంచుకుంటూ తద్వారా వారి ఆలోచనలనూ, అభిప్రాయాలను, కల్పనా శక్తినీ వికసింపజేసుకునేందుకు ఇదో వేదిక. చిన్నారులేకాక పెద్దవారూ 'జాబిల్లి' కోసం రాయవచ్చు. http://jabilli.in/

పెద్దలకో మాట

ఈ వేసవి సెలవుల్లో ఇంటర్నెట్ విహారం పిల్లలకు ఓ మధుర జ్ఞాపకంగా మిగలాలి. కొత్తకొత్త విషయాలను నేర్చుకొనేందుకు దోహదపడాలి. సెలవులే గదా అని కంప్యూటర్‌పై గంటలకొలదీ సమయాన్ని వెచ్చించడం, అవాంఛనీయ సైట్లను దర్శించడం వంటివాటి వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువగా జరుగుతుంది. నాణేనికి రెండు ముఖాలు ఉన్నట్లుగానే ఇంటర్నెట్ వల్ల ఉపయోగాలతో పాటు నష్టాలు కూడా వున్నాయి. అధిక సమయం ఇంటర్నెట్‌లో గడుపుతున్న పిల్లలు 'సైబర్ హింస' బారినపడి ప్రతికూల ప్రభావాలకు లోనౌతున్నారు. "మీ పిల్లలు ఇంటర్నెట్ చూస్తున్నారా? అయితే జాగ్రత్తగా ఉండండి" అని హెచ్చరిస్తోంది నార్టన్ ఆన్‌లైన్ కుటుంబ నివేదిక (ఎన్ఒఎఫ్ఆర్)-2010. "ఆన్‌లైన్ వినియోగంతో భారతీయ బాలలు సైబర్ హింసకు బాధితులుగా మారుతున్నట్లు" ఈ నివేదిక తెలిపింది. 8నుంచి 17ఏళ్ల వయస్సు గల పిల్లలపై నార్టన్ సాఫ్ట్‌వేర్ సెక్యూరిటీ కంపెనీ నిర్వహించిన సర్వేలో ఈ విషయం తేటతెల్లమైంది. ఇంటర్నెట్ వినియోగం పిల్లలను మానసికంగా దెబ్బతీస్తున్నట్లు ఇందులో తేలింది. ఇంటర్నెట్‌ను సక్రమంగా వినియోగించని పిల్లలు మానసికంగా దెబ్బ తినే ప్రమాదమున్నట్లు వైద్యులు కూడా హెచ్చరిస్తున్నారు.

పిల్లల చదువులను టీవీ చెడగొడుతోందని ఆరోపించే తల్లిదండ్రులే 'ఆధునిక విజ్ఞానం' పేరుతో ఇంటర్నెట్‌ను పిల్లల గదిలోకే తెచ్చేస్తున్నారు. ఏమైనప్పటికీ ఇంటర్నెట్ వినియోగిస్తున్న పిల్లలపై పర్యవేక్షణ తప్పనిసరి. అందులోనూ 10నుంచి 17ఏళ్ళ లోపువారిపై మరింత శ్రద్ధ అవసరం. ఈ వేసవి సెలవులు విజ్ఞానార్జనను, మానసిక వికాసాన్ని పాదుకొలిపేదిగా వుండాలని కోరుకుందాం.

- కె.ఎక్స్. రాజు

కొత్త అనుభూతినిచ్చే 'రష్యన్ గీతాలు'

తెలుగు పత్రికల్లో అప్పుడప్పుడు అనువాద కథలు, కవితలు ప్రచురితం అవుతున్నప్పటికీ అవి పుస్తకాలుగా కనబడటం అరుదే. ఒకప్పుడు సోవియట్ సాహిత్యం ఎక్కువగా తెలుగు పాఠకులకు చేరేది. సోవియట్ విచ్ఛిన్నం తరువాత అది ఆగిపోయింది. ప్రస్తుతం తెలుగులో 'విపుల' మాసపత్రిక తప్ప అనువాద కథలను ప్రచురించే పత్రిక మరోటి లేదు. ఇక కవిత్వాన్ని ఎవరు ప్రచురిస్తారు? ఈ నేపథ్యంలో మార్క్సిజం అభిమాని, సోవియట్ సాహిత్యం పట్ల మక్కువ ఎక్కువగా ఉన్న డాక్టర్ జంధ్యాల రవీంద్రనాథ్ వెలువరించిన 'రష్యన్ గీతాలు' కవితాభిమానులకు కొత్త అనుభూతి కలిగిస్తుంది. గమ్జాతోవ్, పుష్కిన్, సెవాక్, దూదిన్, కరీం, కేక్లియాజ్‌ల కవితలను అనువదించి రష్యన్ గీతాల పేరుతో ఆయన విడుదల చేశారు. అన్నీ చిన్న చిన్న కవితలే అయినా కొండంత భావ సంపదను ఇముడ్చుకున్నాయి. ప్రతీ ఒక్క కవితా ఆలోచింపచేసేదే. 'నేను ఎప్పుడైనా లోహంగా మారితే/నా నుంచి డబ్బు ముద్రించకు/పరుల కన్ను కుట్టేలా పర్సులో ఉండటం గిట్టదు నాకు/విధివశాన నేను లోహమైతే/నన్ను ఓ బాకును చెయ్యి/ఒరలో ఉంటే చేస్తా ధ్యానం/బరిలో దిగితే హననం' అనే కవితతో ప్రారంభమైన ఈ పుస్తకంలో 34 కవితలున్నాయి. ఇది అనువాద కవిత్వమే అయినా గొట్టు పదాలతో, చికాకు కలిగించే పదబంధాలతో బాధించదు. రష్యా కవిత్వం మనకేం అర్ధమవుతుంది అనుకునేవారు కూడా చదివాక అనువాద కవిత్వం పట్ల అపోహలు తొలగించుకుంటారు. 'పన్నెండేళ్ల క్రితం మా పెద్దన్న/పోయాడు స్టాలిన్‌గ్రాడ్ యుద్ధంలో/ముదుసలి మా అమ్మ/నల్లని దుస్తుల్లో ఇల్లంతా తిరుగుతూ/కుమిలిపోతుంటుంది/నాకేమో పట్టలేని బాధ/అన్న కంటే పెద్దయ్యాననే ఎరుకతో' ఇలా సున్నితంగా మనసును తడిమే, తడి చేసే కవితలు ఈ పుస్తకంలో ఉన్నాయి. 'విధి చల్లగానే చూసింది/నేను కబోదిని కాను/ఉన్మాదినీ కాను/కాని..రొట్టె ముక్క ధర తగ్గి/మనిషి ప్రాణం విలువ పెరగాలనే నా కోర్కె'...నిత్యావసరాల ధరలు చుక్కలనంటుతున్న ప్రస్తుత పరిస్థితిలో మన ఆవేదనా ఇదే కదా! 'అతడు యోగి కాడు/మానవాతీతుడు కాదు/కాని అతడికి ప్రణమిల్లండి/అతడు మానవుడు'..అభ్యుదయ కవులు మనిషికే పెద్ద పీట వేశారనడానికి ఇదో ఉదాహరణ. అనువాదకుడు అభ్యుదయ సాహిత్యాన్ని మరింతగా ప్రజలకు చేరువ చేస్తారని ఆశిద్దాం.

రష్యన్ గీతాలు, అనువాదం-డాక్టర్ జంధ్యాల రవీంద్రనాథ్, వెల: రూ.20, ప్రతులకు: అనువాదకుడు, ఫ్లాట్ నెం. 104, డిఆర్‌కె రాజు టౌన్‌షిప్, మధురవాడ, విశాఖపట్నం-530 048.

- ఎం.నాగేందర్

కొత్త పుస్తకాలు

కథలు - గాథలు

అవసరార్థం చదవడం తప్పితే మనలో అత్యధికులకు చరిత్ర అంటే బోర్ సబ్జెక్టు. అలాగని దానిని చదవకుండా ఉండలేం. అవసరం కొద్దీ చదివినా కూడా అయిష్టంగానే చదువుతాం. ఈ మొక్కుబడి తంతు వల్ల దాని నుంచి పొందవలసిన ప్రయోజనాలు, ఫలితాలు పొందలేకపోతున్నాము. ఇలాంటి ఇబ్బందులను తొలగించి ప్రతి ఒక్కరూ అర్థం చేసుకునే రీతిలో దిగవల్లి వేంకట శివరావు చరిత్రను చక్కని కథలుగా మలిచి 'కథలు-గాథలు' పుస్తకం ద్వారా మనకందించారు. దీనిలో పొందుపరిచిన కథల రూపంలోని సంఘటనలు చదివితే మన పూర్వీకుల జీవన విధానాలు, చరిత్రను ఆసక్తిగా అధ్యయనం చేయవచ్చు. వారి అనుభవాలను అర్థం చేసుకోవడం ద్వారా ప్రస్తుత మన జీవితాలను తీర్చిదిద్దుకోవచ్చు. సుఖప్రదమైన జీవితాన్ని పొందవచ్చు. ఉదాహరణకు మైసూరు రాజ్యాన్నేలిన హైదరాలీ తనకు కష్టాలు ఎదురైనప్పుడు బ్రాహ్మణులతో పూజలు, శాంతి హోమాలు చేయించేవాడట. ఇదే అలవాటును ఆయన కుమారుడు టిప్పు సుల్తాన్ కూడా పాటించాడట. అందుకే మైసూరు ప్రాంతంలో చాముండేశ్వరి వంటి ప్రపంచ ప్రసిద్ధ మందిరాలను నిర్మించాడు. చరిత్ర పుస్తకాల్లో దాదాపు 3,4 పేజీల్లో వివరిస్తూ బోర్ కొట్టించే ఈ విషయాన్ని రచయిత కేవలం ఒక్క పేజీలోనే తెలియజెప్పారు. పైగా దీనిలో హైదరాలీ పాలనా కాలాన్ని, టిప్పుసుల్తాన్ ఘనతలను, వారు పాటించిన లౌకికత్వాన్ని, సామాజిక స్పృహను తారీఖులు, ఘటనాక్రమాలతో సహా చాలా ఆసక్తికరంగా, అందరికీ సులభంగా అర్థమయ్యే తీరులో చెప్పారు. ఇలాంటివే దాదాపు 58 చారిత్రికాంశాల (ఒక్కొక్కదానిలో 5 నుంచీ 10 ఉపాంశాలు) వరకూ ఈ పుస్తకంలో పొందుపరిచారు. చారిత్రక విజ్ఞానాన్ని ఇలా ఆసక్తిగా వివరించడం అందరికీ సాధ్యమయ్యే పని కాదు. అంతటి కష్టతరమైన పనిని మనకిష్టమైన రీతిలో మలిచిన దిగవల్లిగారి కృషి అభినందనీయం. ఈ పుస్తకం వల్ల చరిత్రను ఆసక్తిగా చదవడమే కాదు మనకు తెలిసిన చరిత్రను పరిపుష్టం చేసుకోవచ్చు. పైగా కొత్త కోణాల్లో చరిత్రను అర్థం చేసుకోవచ్చు. పాశ్చాత్య సంస్కృతి మోజులో పడి కొట్టుకుపోతున్న మనల్ని మనం రక్షించుకునే ఆయుధంగానూ మన పూర్వీకుల అనుభవాలను, చరిత్రను మలచుకునే అపురూప అవకాశం కూడా పొందవచ్చు.

కథలు - గాథలు, దిగవల్లి వేంకట శివరావు, వెల : 180/-, పేజీలు : 347, ప్రతులకు :విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 4-1-435, విజ్ఞాన్ భవన్, అబిడ్స్, హైదరాబాద్ - 001. మరియు విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు.

- ఎన్. మదనయ్య

కోస్తా కాలుష్య కాసారంలో నిప్పుకణికలై మండుతున్న సోంపేటలు
సీపీఐ(ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ
పేజీలు : 74, వెల : 20/-, ప్రతులకు : ప్రజాపంథా, మార్క్స్‌భవన్, 658, విద్యానగర్, 7వ లైను, హైదరాబాద్-44, సహచర బుక్ హౌస్, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్,. దిశ బుక్‌హౌస్, మోర్‌సూపర్‌మార్కెట్, చిక్కడపల్లి, హైదరాబాద్, నవోదయ బుక్‌హౌస్, మైత్రి బుక్‌స్టాల్, విశాలాంధ్ర, ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీల్లో.

స్వీకారం

ఆశారాజు కవితా వైభవం
సౌభాగ్య
వెల : 80/-, పేజీలు :117
ప్రతులకు :
విశాలాంధ్ర బుక్ హౌస్, నవోదయా బుక్ హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాద్, నవయుగ బుక్‌హౌస్, విజయవాడ.



నవ్వుల్ - పువ్వుల్

చేతి తొడుగులు

డాక్టర్: ఏమయ్యా! నా చేతి తొడుగులు నీ పొట్టలోనే వుండిపోయాయి. మళ్లీ ఆపరేషన్ చేయాల్సి వస్తుందేమోనని అనుమానంగా వుంది.
రోగి: ఫర్వాలేదండి. ఫీజుతోపాటు వాటి ధర కూడా కట్టేస్తాను. మీరు నన్ను వదిలిపెడితే చాలు.

చివరి మాటలు

రచయిత: మీకు నా నవల నచ్చిందా?
ప్రచురణకర్త: ఆ.. అందులో చివరి రెండు మాటలు నాకు ఎంతగానో నచ్చాయి.
రచయిత: (ఉత్సాహంగా...) ఏ రెండు మాటలు సార్?
ప్రచురణకర్త: ది ఎండ్ (అయిపోయింది)



అడ్రస్

కొంటె ప్రశ్న: గృహిణి వేసుకునే డ్రస్ ఏది?
కోణంగి జవాబు: అడ్రస్.

శాంతి కోసం

1వ సైనికుడు: నువ్వు సైన్యంలో ఎలా చేరావు?
2వ సైనికుడు: నాకా ఎటూ భార్య లేదు. పైగా యుద్ధమంటే ఇష్టం. అందుకని సైన్యంలో చేరా! మరి సైన్యంలో నువ్వెలా చేరావు?
1వ సైనికుడు: నీలాగా కాదులే. నాకు భార్య వుంది. కానీ నేను శాంతి కాముకుడ్ని. అందుకని సైన్యంలో చేరా.

సంతోషం

ప్రచురణకర్త: ఇది మీరు రాసిన కవితేనా!
యువ కవి: అవునండీ! ఇందులోని ప్రతి పదం నా మదిలోంచి పుట్టినదే.
ప్రచురణకర్త: ఓ.. రామదాసుగారూ! మీరు నన్ను క్షమించాలి! ఎందుకంటే మీరు చాలా ఏళ్ల కిందటే చనిపోయారని పొరబడ్డాను.

పిగ్‌నిక్

వ్యక్తి: ఆయన శనివారం సాయంత్రం తన పందుల్ని ఎక్కడికో తీసుకెళ్లినట్టున్నాడు?
మహిళ: అవును. పిగ్‌నిక్‌కి.

తెరవలేదు

ప్రశ్న: దాని దగ్గర చాలా కీస్ ఉన్నాయి. కానీ ఒక్క తలుపు కూడా తెరవలేదు. ఇంతకీ ఏంటది?
జవాబు: పియానో!

ఎత్తలేక

సరిత: మా ఆయన నన్ను కుర్చీతోనే ఎందుకు కొట్టడంటావ్?
వనిత: టేబుల్ ఎత్తలేకేమో!

పి.లక్ష్మీ పొన్నూరు.

చెత్తరాత

పంతులు : (కుర్రాడితో) ఒక డాక్టర్‌కి ఉండాల్సిన ముఖ్యమైన లక్షణమేంటిరా?
క్రాంతి : చేతిరాత చెత్తగా ఉండడమేనండీ.

పనిమీద!

అప్పారావు : బాబూ! మీ నాన్న ఉన్నాడా?
మురళీ : లేడు.
అప్పారావు : పనిమీద వెళ్లాడా.
మురళీ : కాదు. సైకిల్ మీద వెళ్లాడు.

వేడిగా... చల్లగా...

గోపి : వేడిగా ఏమున్నాయ్?
సర్వర్ : కూల్‌డ్రింక్సండి.
గోపి : మరి చల్లగా ఏమున్నాయ్?
సర్వర్ : కాఫీ, టీలు ఉన్నాయి.

తమ్ముడు

శశి : నీకు తమ్ముడు పుట్టాడు కదా!
రాజు : నాక్కాదు. మా అమ్మకి.
శశి : ఓహో! మీ అమ్మకి తమ్ముడు పుట్టాడన్నమాట.

- క్రాంతి కుమార్, ఆదిలాబాద్.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్

సినిమా కబుర్లు

మెగాతారకు కుమారుడిగా ఘన వారసత్వం... మూడే మూడు చిత్రాలతోనే మాస్ హీరోగా శిఖర సదృశమైన పేరు ప్రఖ్యాతులు... చేసే ప్రతి సినిమా పైన, వేసే ప్రతి అడుగు పైన సమాచార ప్రసార సాధనాల్లో పైసా ఖర్చు లేని విపరీత ప్రచారం... బహుశా ఇవి చాలా కొద్దిమందికే దక్కే అనుభవాలు, అదృష్టాలు. ఆ అరుదైన అదృష్టం - హీరో చిరంజీవి ఏకైక కుమారుడైన **రామ్‌చరణ్ తేజ్** ది. 'చిరుత', 'మగధీర', 'ఆరెంజ్' చిత్రాలతో తెలుగు ప్రేక్షకలోకంలో క్రేజు సంపాదించుకున్న నవ యువ హీరో రామ్‌చరణ్ తేజ్ ఇప్పుడు తమిళ చిత్రపరిశ్రమలోకి కాలుమోపుతున్నారు. 1972 నుంచి చిత్ర నిర్మాణంలో ఉన్న 'గీతా ఆర్ట్స్' పతాకంపై ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తమ బ్లాక్‌బస్టర్ 'మగధీర'ను తమిళంలోకి 'మావీరన్'గా అనువదిస్తూ, తమిళ సినీ ప్రేక్షకులకు రామ్‌చరణ్‌ను పరిచయం చేస్తున్నారు. పుట్టి పెరిగిన తమిళనాట సినీ రంగ ప్రవేశం చేస్తూ, మార్కెట్‌ను విస్తరించుకుంటున్న ఆనందంలో ఉన్న ఈ యువ హీరోతో ముఖాముఖి...



ఇక్కడ చేయలేనివి అక్కడ చేయగలుగుతా!

'మగధీర' చిత్రం ఇప్పుడు తమిళంలో వస్తోంది కదా! మీ ఆలోచనలు, అంచనాలు?

'మగధీర' చిత్రం పేరుకు తెలుగు చిత్రమైనా, అది కేవలం తెలుగు నాట ప్రజలకే కాదు, అన్ని ప్రాంతాల వారికీ నచ్చే, అందరూ మెచ్చే చిత్రం. అందుకు తగ్గట్లే ఇప్పుడిది 'మావీరన్'గా తమిళంలో వస్తోంది. ఈ 'మావీరన్' చిత్రం కోసం తెర ముందు, తెర వెనుక ఎంతోమంది 'మావీరన్'లు (తమిళంలో మహావీరులు అని అర్థం) పనిచేశారు. ఈ చిత్రానికి తెలుగులో అన్ని రకాల విజయాలూ లభించాయి. వసూళ్ళ వర్షంతో పాటు అవార్డులూ వచ్చాయి. కాగా, కళలోనూ, మంచి చిత్రాలను ఆస్వాదించడంలోనూ, ఆదరించడంలోనూ తమిళ ప్రజానీకం ఎప్పుడూ ముందుంటారు. కాబట్టి, ఇప్పటికే ఎంతో సాధించిన ఈ చిత్రాన్ని వారు మరింత ముందుకు తీసుకువెళతారని ఆశిస్తున్నా.

తమిళ చిత్ర సీమలోకి అడుగుపెట్టడానికి మీరు నేరు చిత్రం కాక, ఓ డబ్బింగ్ చిత్రాన్ని ఎంచుకున్నారు. ఒక డబ్బింగ్ సినిమా మీద మీకు ఏమిటంత ధీమా?

'మగధీర' పక్కా పైసా వసూల్ చిత్రం. బైకులతో పోటీలు, గుర్రపుస్వారీలు, ప్రేమ పాటలు, అపూర్వమైన గ్రాఫిక్స్‌తో సహా అద్భుతమైన సాంకేతిక నైపుణ్యం - ఇలా అన్నీ ఉన్నాయి. ప్రేక్షకులకు కనువిందు చేసే ఇలాంటి చిత్రాలను ఒక భాషకే, ఒక రాష్ట్రానికే పరిమితం చేయకూడదు. ఇలాంటి వాటిని అన్ని రాష్ట్రాల వాళ్ళూ చూడాలి. అందుకే, దీన్ని 'మావీరన్'గా తమిళంలోకి తెస్తున్నాం. ఇది తమిళ ప్రేక్షకులకు కూడా తప్పకుండా నచ్చుతుంది. మీకో విషయం తెలుసా? 'మగధీర' చిత్రం డి.వి.డి. రూపంలో వచ్చినప్పుడు గరిష్ఠ సంఖ్యలో డి.వి.డి.లు అమ్ముడైంది - తమిళనాడులోనే! ఇప్పుడీ అనువాదం ద్వారా తమిళ ప్రేక్షకుల హృదయాల్లో నాకంటూ ఓ చిన్న స్థానం దక్కుతుందని ఆశిస్తున్నా.

అసలు ఈ సినిమాను తమిళంలోకి, హిందీలోకి రీమేక్ చేస్తున్నారని మొదట్లో వార్తలు వచ్చాయి కదా! తీరా ఇప్పుడిలా డబ్బింగ్...?

నిజానికి, ఓ దశలో ఈ చిత్రాన్ని తమిళంలోకి రీమేక్ చేయాలనే అనుకున్నాం. అందుకనే తెలుగు 'మగధీర'ను తమిళనాడు ప్రాంతంలో అసలు రిలీజే చేయలేదు. కానీ, రీమేక్ అంటే మళ్ళీ అంతకు అంత ఖర్చు! పైగా నాకూ, దర్శకుడికీ డేట్లు కుదరాలి. అంతా చేస్తే, మాతృకకూ, రీమేక్‌కూ పెద్దగా తేడా ఉండకపోవచ్చు. దాంతో, చివరకు డబ్బింగ్ వైపే మొగ్గాం. ఇక, హిందీలో అంటారా! ఈ కథను అక్కడ మరో పెద్ద హీరోతో నిర్మించేందుకూ, లేదంటే కథను ఇచ్చేందుకూ నిర్మాత చర్చలు జరుపుతూనే ఉన్నారు. ఇంకా ఏదీ ఓ కొలిక్కి రాలేదు.

'మగధీర' కథతో హిందీలో కూడా ప్రవేశించవచ్చుగా! హిందీ సినిమాలు చేసే ఆలోచన లేదా?

ప్రస్తుతానికి ఆ ఆలోచన లేదు. నేను ప్రధానంగా దక్షిణాది చిత్ర పరిశ్రమ మీదే దృష్టి పెట్టదలుచుకున్నాను.

తెలుగు 'మగధీర' విడుదలైన దాదాపు రెండేళ్ళకు తమిళ డబ్బింగ్ వస్తోంది. బాగా ఆలస్యమైపోలేదా?

మంచి సినిమా చూడడానికి అది ఓ అభ్యంతరం అనుకోవడం లేదు. మే నెలాఖరు కల్లా తమిళ రూపం విడుదలవుతుంది. మలయాళ రూపం కూడా త్వరలోనే వస్తుంది.

'మగధీర' తమిళ అనువాదం కోసం ఏమైనా మార్పులు, చేర్పులు చేశారా?

ఈ సినిమాకు సంగీతం పెద్ద ప్లస్ పాయింట్. తమిళ రూపం కోసం సంగీతంలో కానీ, సన్నివేశాల్లో కానీ ఎలాంటి మార్పులూ చేయలేదు. బోలెడన్ని భావోద్వేగాలు, వినోదం ఉన్న సినిమా ఇది. తమిళ నాట కూడా ప్రేక్షకులను ఇది నిరాశపరచదు. ముఖ్యంగా, ప్రేమకథ, డ్యాన్సులు, ఫైట్లు అన్ని చిత్రాలలో లాగానే ఉన్నప్పటికీ, కథలో అంతర్భాగంగా వచ్చే 400 ఏళ్ళ క్రితం నాటి సన్నివేశాలు అందరినీ ఆకట్టుకుంటాయని భావిస్తున్నాను.

తమిళనాట ఘనవిజయం సాధించిన తెలుగు డబ్బింగ్‌లు తక్కువే! ఆ సమస్యను అధిగమించడానికి మీరు తీసుకున్న జాగ్రత్తలు...

డబ్బింగ్ చిత్రాలు ఎలా ఆడతాయో నాకు తెలియదు. అయితే, డబ్బింగ్ చిత్రమనే సరికి మూలభాష ప్రేక్షకులనే కాక, ఇటు అనువాదమైన భాషా చిత్ర ప్రేక్షకుల అంచనాలను కూడా సంతృప్తి పరచాలి. 'మావీరన్' ఆ పని చేస్తుందని నేను నమ్మకంగా ఉన్నాను. ఇక, డబ్బింగ్ ప్రక్రియ మరీ క్లిష్టమైనదేమీ కాదు. అయితే, తెలుగులో మాటలు, పాటల్లో ఉన్న శక్తినీ, సొబగునూ తమిళంలోకి కూడా తీసుకురావడం కోసం చాలా శ్రమించారు. 'మావీరన్'లో పాటలు చాలా బాగా వచ్చాయి. కె. భాగ్యరాజా చేత మాటలు రాయించి, అవసరమైనచోట మరింత సానపట్టించాం. నన్నడిగితే, కొన్ని ఘట్టాలు తెలుగులో కన్నా, తమిళ డబ్బింగ్‌లోనే మరింత మెరుగ్గా ఉన్నాయి. నిజానికి, నా పాత్రకు నేనే డబ్బింగ్ కూడా చెప్పుకోవాలని అనుకున్నాను. కానీ, షూటింగులతో తీరిక లేకపోవడంతో కుదరలేదు. నాణ్యమైన

డబ్బింగ్‌తో, భారీయెత్తున ప్రింట్లు, పబ్లిసిటీతో ఓ నేరు తమిళ చిత్రం లాగా దీన్ని విడుదల చేయనున్నాం.

అన్నట్లు, 'మావీరన్' అనే టైటిల్ తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ పాత హిట్ చిత్రం పేరు! ఆ రకంగా మీ తమిళ సినీ రంగప్రవేశానికి ఓ సెంటిమెంట్ కలిసొచ్చినట్లుందే!

(ఆనందంగా...) సూపర్‌స్టార్ రజనీకాంత్ సినిమా పేరే నా సినిమాకూ టైటిల్‌గా రావడం చెప్పుకోదగ్గ సంగతి. నిజం చెప్పాలంటే, అది ఓ శుభ సూచన కూడా! మా 'మావీరన్' చిత్ర విజయానికి ఆ సెంటిమెంట్ కూడా తోడ్పడితే అంతకన్నానా!

'మగధీర' తరువాత మీలో వచ్చిన మార్పు?

(నవ్వుతూ...) వ్యక్తిగతంగా నాలో ఏ మార్పూ లేదు. అయితే, మార్కెట్ పరంగా ఆ సినిమా నాకు ఓ కొత్త ప్రపంచానికి తలుపులు తెరిచింది. నా అభిమానుల సంఖ్యను పెంచింది. తండ్రి చాటు బిడ్డగా కాకుండా, ఓ హీరోగా నాకంటూ ఓ ఇమేజ్‌నూ, నా మీద నాకు నమ్మకాన్నీ, నా చిత్రాల పట్ల అభిమానుల్లో అంచనాలనూ కల్పించింది. వారు ఇప్పుడు నా నుంచి మరింత ఎక్కువ ఆశించడం మొదలైంది. అదే సమయంలో నేను మా నాన్న గారి పేరు చెడగొట్టబోనని కూడా వారు గ్రహించారు. 'మగధీర' తరువాత నటుడిగా నేను మరింత బాధ్యతాయుతంగా తయారయ్యాను.

'మగధీర'లోని మీ పాత్ర మిమ్మల్ని ఒక్కసారిగా ఎంతో ఎత్తుకు తీసుకువెళ్ళింది. అసలు మొదట కథ చెప్పినప్పుడు ఆ పాత్రను మీరు చేయగలనని అనుకున్నారా?

నిజం చెప్పాలంటే, ఇంతటి శక్తిమంతమైన పాత్రను పోషించగలనని నేను అనుకోలేదు. ఈ పాత్రకు నేను సరిగ్గా సరిపోతాననీ, బాగా చేయగలననీ నా కన్నా మా దర్శకుడు రాజమౌళికే నా మీద ఎక్కువ నమ్మకం. ఆ నమ్మకాన్ని నిలబెట్టడానికి నా వంతుగా నేను శ్రమించాను. ఆరు నెలల పైగా పడిన కష్టంతో ఆ పాత్ర నలుగురికీ మెచ్చేలా తయారైంది. ఈ సినిమా కోసం నేను పొడుగాటి జుట్టు పెంచాను. పాటలు, ఫైట్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాను. ప్రమాదభరితమైన ఘట్టాల్లో కూడా డూప్ లేకుండా స్వయంగా పాల్గొన్నాను.

'మగధీర'కు మీరందరూ పడ్డ కష్టం తెర మీద కనపడింది. కానీ, ఆ చిత్రం పరిశ్రమలో రికార్డులు సృష్టిస్తూ, ఇంతటి విజయం సాధిస్తుందని ఊహించారా?

'మగధీర' ఇంతటి బ్లాక్‌బస్టర్ అయిందనే విషయం నాకిప్పటికీ నమ్మశక్యం కావడం లేదు. నన్ను తప్పుగా అర్థం చేసుకోకండి. సినిమా వాణిజ్య విజయం సాధిస్తుందని అనుకున్నాను కానీ, ఇంత భారీ విజయాన్ని అందుకుంటుందని మేము ఊహించలేదు. చిత్రకథలో వచ్చే చారిత్రక కథా నేపథ్యం, ఆ సన్నివేశాలు ప్రధాన ఆకర్షణ అయ్యాయి.

మీరు చెన్నైలో పుట్టి పెరిగారు. అక్కడ పెద్ద పెద్ద కటౌట్లతో, అక్కడి భాషలో భారీగా మీ చిత్రం విడుదలవుతుంటే ఏమనిపిస్తోంది?

చెన్నై అనగానే నా మనసులో ఎన్నో సంగతులు, సంఘటనలు, జ్ఞాపకాలు రింగు రింగుమంటాయి. చెన్నైలోని ప్రముఖ పద్మా శేషాద్రి బాల భవన్‌లోనే నేను, అల్లు శిరీష్ (అల్లు అర్జున్ తమ్ముడు) చదువుకున్నాం. ఒక రకంగా చెప్పాలంటే, నా చిన్నతనమంతా గడిచిన చెన్నై నాకు సొంత ఇల్లు లాంటిది. అలాంటి ఊళ్ళో రోడ్ల మీద నా కటౌట్లు, గోడల మీద నా పెద్ద పెద్ద వాల్‌పోస్టర్లు చూస్తే, గమ్మత్తుగా ఉంది. (ఉద్వేగంగా...) చిన్న పిల్లాడికి అమ్మ చేతిలో నుంచి చాక్లెట్ దక్కినంత ఆనందంగా ఉంది. నా సినిమా తమిళంలో, తమిళ నాట, అందులోనూ నేను పుట్టి పెరిగిన చెన్నైలో విడుదలవుతోందని ఎంతో ఉద్విగ్నంగా ఉన్నాను. చెన్నై అంటే నాకు ఎంతో ఇష్టం. చెన్నై పేరు చెప్పగానే కొట్టొచ్చినట్లు నాకు స్ఫురించే విషయం ఒకటి ఉంది. అది ఏమిటంటే – చెన్నైలో ప్రజలు ఊహల్లో విహరిస్తూ, గాలిలో తేలిపోరు. నేల మీద కాళ్ళు పెట్టి నడుస్తూ, ఆచరణాత్మకంగా, మామూలుగా వ్యవహరిస్తారు. పైగా కళలు, సంస్కృతికి ప్రాధాన్యమిస్తూ, జనజీవనం సాగడం తమిళనాట, మరీ ముఖ్యంగా చెన్నైలో నాకు బాగా నచ్చే అంశం.

'ఆరెంజ్' తరువాత ఇప్పుడు ఇంతకీ మీరు చేస్తున్న సినిమా?

తమిళ దర్శకుడు ధరణి నిర్దేశకత్వంలో సినిమా చేస్తున్నాను.

కానీ, చాలా రోజులుగా ఆ సినిమా షూటింగ్ జరగడం లేదు. ఆ సినిమా ఆగిపోయిందటగా?

ఆ చిత్రం వాయిదా పడింది. అంతేతప్ప, రద్దు కాలేదు.

సరే! మరి వేరే సినిమాలు చేయాలి కదా!

వి.వి. వినాయక్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నా. అలాగే, 'బృందావనం' ఫేమ్ వంశీ పైడిపల్లి దర్శకత్వంలో మరో సినిమా చేయబోతున్నా.

దక్షిణాది మీదే మీ దృష్టి అన్నారు. మరి, తమిళ చిత్రాలు చేయాలని అనుకోవడం లేదా?

ఎందుకు లేదు! చేయాలనే ఉంది. దాని కోసం చర్చలు కూడా జరుగుతున్నాయి. కానీ, ఇప్పటి వరకు ఏదీ ఖరారు కాలేదు. తగిన కథ వస్తే, తప్పకుండా తమిళంలో సినిమా చేస్తాను. నటీనటులందరి లాగానే నేను కూడా మంచి చిత్రాల్లో నటించాలని అనుకుంటున్నాను.

తమిళ చిత్ర పరిశ్రమను చిన్నప్పటి నుంచి చూస్తున్నారు కదా! అక్కడి సినీ రంగంపై మీ అభిప్రాయం?

ఉన్నమాట చెప్పాలంటే, తమిళ చిత్ర పరిశ్రమ అంతర్జాతీయ స్థాయి చిత్రాలకు దీటైన నాణ్యతతో కూడిన సినిమాలు రూపొందిస్తోంది. పైగా, దేశ విదేశాల్లో తమిళులు స్థిరపడడంతో, ఆ భాషలో సినీ ప్రేక్షకుల సంఖ్య కూడా ఎక్కువ. మన తెలుగు చిత్ర పరిశ్రమ ప్రధానంగా హీరో చుట్టూ తిరుగుతుంటుంది. అలాంటి సినిమాలే వస్తుంటాయి. వాణిజ్య ప్రధాన చిత్రాలకు పెద్ద పీట వేసే తెలుగు, హిందీ చలనచిత్ర సీమలతో పోలిస్తే, తమిళంలో బోలెడన్ని ప్రయోగాత్మక చిత్రాలు రూపొందుతుంటాయి. తమిళంలో ప్రతిభావంతులైన నటీనటులు, దర్శకులు, సాంకేతిక నిపుణులు కూడా ఎక్కువ. తమిళ సినీ రంగం మనకు ఓ పెద్ద విపణి. తెలుగు సినీ రూపకర్తలు ఆ సంగతి గ్రహించి, ఆ మార్కెట్‌ను కూడా సద్వినియోగం చేసుకోవాలి.

అంటే, తమిళ చిత్రసీమతో, తెలుగు పరిశ్రమ చేతులు కలపాలంటారు!

అవును. 'మావీరన్' ఆడియో విడుదలకు ముఖ్య అతిథిగా విచ్చేసి, పాటలను ఆవిష్కరించిన కమలహాసన్ మాట్లాడుతూ, సినీ పరిశ్రమలో ఆరోగ్యకరమైన పోటీ ఉండాలి. పరాయివాళ్ళకు భారతీయ సినిమా అంటే ముంబయ్‌లోని హిందీ చిత్రాలే గుర్తుకొస్తున్నాయి. ఆ అభిప్రాయాన్ని మార్చాలి. అందుకు, తమిళ, తెలుగు చిత్రసీమలు చేతులు కలపాలి. ఈ రెండు చిత్రపరిశ్రమలూ కలసికట్టుగా పరిశ్రమిస్తే ప్రభంజనమే' అన్నారు. మణిరత్నం, కె.ఎస్. రవికుమార్ లాంటి ప్రముఖ దర్శకుల ముందు ఆయన వ్యక్తం చేసిన ఆ అభిప్రాయం ఎంతో విలువైనది, సమంజసమైనది. ఆ ప్రభంజనానికి మా 'మావీరన్' చిత్రం శ్రీకారం చుట్టాలని ఆశిస్తున్నా. ఒకప్పుడు కలసి ఎదిగిన ఈ రెండు చిత్ర సీమల బంధం రానున్న కాలంలో మరింతగా పెనవేసుకోవాలని కోరుకుంటున్నా.

అన్నట్లు 'మావీరన్' ఆడియో విడుదల చేసిన కమలహాసన్ మీతో ప్రత్యేకంగా మాట్లాడుతూ, ఏదో ప్రతిపాదన చేశారట?

(నవ్వేస్తూ...) కమలహాసన్ గారు తన దర్శకత్వంలో మా నాన్న గారు హీరోగా సినిమా చేయాలంటూ దాదాపు 20 ఏళ్ళ క్రితం ఓ ప్రతిపాదన చేశారట! అది ఆచరణలోకి రానే లేదు. ఇప్పుడు నాన్నగారు రాజకీయాల్లోకి వెళ్ళిపోయారు కాబట్టి, ఇప్పుడిక నన్ను హీరోగా పెట్టి, తాను దర్శకత్వం వహిస్తానని అన్నారు. కమలహాసన్ లాంటి వ్యక్తి నుంచి అలాంటి ప్రతిపాదన, ఆలోచన రావడమే నన్ను ఉక్కిరిబిక్కిరి చేసేస్తోంది.

చిత్ర పరిశ్రమలో బోలెడంత పోటీ ఉంది కదా!

మా నాన్న గారు గతంలో ఒకే ఏడాది 12 చిత్రాల్లో నటించిన సందర్భాలూ ఉన్నాయి. ఇతరులతో పోటీ గురించి ఆలోచించే తీరిక కూడా ఆయనకు ఉండేది కాదు. మన పని మనం చేసుకుంటూ వెళ్ళడమే తప్ప, మిగిలిన విషయాలు ఆలోచించడం అనవసరం. తెలుగు చిత్ర పరిశ్రమలో నా చిత్రం మీద బోలెడన్ని అంచనాలు, ఆర్థిక లావాదేవీలు ఉంటాయి కాబట్టి, ఇక్కడి సినిమాల్లో నేను ప్రయోగాలు చేయలేను. కానీ, తమిళంలో ఇప్పుడే తొలి అడుగు వేస్తున్నాను కాబట్టి, అక్కడ నేను ప్రయోగాలు చేయగలుగుతాను.

చిరంజీవి లాంటి మెగాస్టార్ కుమారుడైన మీ మీద హీరోగా ఉన్న బాధ్యత?

చిరంజీవి లాంటి పెద్ద హీరోకు కుమారుణ్ణి కావడం నాకు దేవుడిచ్చిన వరం. ఆయన పేరు చెడగొట్టకుండా, చక్కటి చిత్రాల్లో నటిస్తూ, అభిమానులతో సహా ప్రేక్షకులందరి ఆదరణ పొందాలన్నదే నా ప్రయత్నం.

-రెంటాల జూనియర్

ఆ తొమ్మిది నెలలు... కల్పిత గాథలు...

కుమారి శ్రీమతి కావడం ఒక థ్రిల్. శ్రీమతి తల్లి కాబోతోందని తెలియడం చెప్పలేనంత థ్రిల్. గర్భం ధరించిందని తెలియగానే ఎంతోమంది ఎన్నెన్నో సలహాలు - కల్పిత గాథలు చెప్పి గర్భవతిని ఎంతో కంగారు పెట్టేస్తారు. వాటిలో నిజానిజాలేమిటో స్పష్టంగా తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ఆరోగ్యవంతమైన, అందమైన, ఆకర్షణీయమైన బిడ్డ పుట్టేందుకు ఇచ్చే సలహాలు విని ఆమెకు వేవిళ్ల వల్ల వచ్చే ఇబ్బంది కన్నా ఈ సలహాల తలనొప్పి ఎక్కువైపోతూ ఉంటుంది.

- సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

ఉదయాన్నే తెల్లని పదార్థం తింటే పుట్టే బిడ్డ మంచిరంగులో పుడతాడు : ఇది చెప్పింది ఎవరో కాదు. సైన్సులో పోస్టుగ్రాడ్యుయేట్ అయిన ఒకామె గర్భవతికి ఇచ్చిన సలహా. అయితే తెలివైన ఆ గర్భవతి ఒక ప్రశ్న వేసింది. ఆఫ్రికన్ మహిళలు గర్భం ధరించినప్పుడు ఉదయాన్నే పాలు తాగితే వారికి తెల్లని పిల్లలు పుడతారా? అని. జవాబు ఇవ్వలేని ఆమె అయోమయంగా చూసింది.

గర్భవతి కొబ్బరి పువ్వు తింటే కొడుకు పుడతాడు : ఇదే నిజమైతే సాగరతీర ప్రాంతాల్లో ప్రతి కుటుంబంలోనూ తప్పనిసరిగా ఒక కొడుకు ఉండాలి. అలా జరగడంలేదు కదా!

గర్భవతి స్వీట్స్ ఇష్టంగా తింటుంటే ఆమె గర్భంలో మగ శిశువు ఉన్నట్లే! : ఇలాంటి కథలు విని గర్భవతులు బలవంతంగా స్వీట్లు తింటే చివరకు అనారోగ్యం పాలయి ప్రాణం మీదకు తెచ్చుకుంటారు. గర్భవతులు తినే తిండి ప్రభావం బిడ్డ పుట్టిన తర్వాత ఆ బిడ్డ తిండి అలవాట్లను ప్రభావితం చేస్తే చెయ్యొచ్చు. అంతే గాని బిడ్డ సెక్సును నిర్ణయించదు.

బిడ్డ పుట్టకముందే ఆ బిడ్డకు దుస్తులు తయారు చేస్తే మృత శిశువు జన్మిస్తుంది : ఇదొక అర్థరహితమైన అపోహ. నిజానికి ప్రస్తుతమున్న న్యూక్లియర్ కుటుంబాల్లో ప్రతి దానికి ఇతరుల మీద ఆధారపడడం సాధ్యం కాదు. కొత్తగా పుట్టిన బిడ్డకు పరిశుభ్రమైన మెత్తటి నూలు దుస్తులు మాత్రమే వేయాలి. బజార్లో దొరికే బట్టలు వేయడం మంచిది కాదు.

ఇటువంటి అపోహలు సులువుగా జనంలోకి వెళ్లి బిడ్డకు కావలసిన సదుపాయాలు చేసుకోవడంలో నిర్లక్ష్యం జరుగుతూ ఉంటుంది. పైగా ఈ మాటలు గర్భిణీ స్త్రీలను భయభ్రాంతులను చేస్తాయి. ఇటువంటివి వినకుండా హాయిగా శాస్త్రీయంగా వివరించిన పుస్తకాలను చదువుకుని నిజానిజాలు తెలుసుకోవడం మంచిది.

కృష్ణ పక్షంలో బిడ్డ జన్మిస్తే నలుపు రంగులో ఉంటాడు : ఈ కల్పిత గాథకు ఎటువంటి శాస్త్రీయ కారణాలు కన్పించవు. కృష్ణపక్షంలో పుట్టిన ఎందరో బిడ్డలు మంచి రంగు గల చర్మంతో జన్మించిన వారున్నారు.

గర్భిణీ కడుపు పెద్దదిగా ఉంటే ఆడపిల్ల పుడుతుంది: ఇదొక తమాషా అపోహ. ఆమె శరీర తీరును బట్టి కడుపు పెద్దదిగా లేదా చిన్నదిగా ఉంటుంది. పొట్టిగా ఉండేవారికి కడుపు పెద్దదిగా కన్పించవచ్చు. భారీ శరీరం గల వారికి కడుపు చిన్నదిగా కన్పించవచ్చు. అంతే కాకుండా గర్భాశయంలోని ప్లాసెంటా ద్రవం, గర్భస్థ శిశువు పరిమాణాన్ని బట్టి కూడా కడుపు సైజు ఆధారపడి ఉంటుంది. గర్భస్థ శిశువు ఆరోగ్యంగా ఎదుగుతుంటే కడుపు పెద్దదిగా ఉందని సంతోషించాలి. మగబిడ్డ పుడతాడని పొరపాటున కడుపును లోపలకు నొక్కుకునే వెర్రిపనులు చేయకూడదు.

గర్భస్థ శిశువు మగ బిడ్డయితే అందవికారంగానూ, ఆడబిడ్డయితే అందంగానూ కన్పిస్తారు : గర్భవతికి నెలలు నిండేకొద్దీ శరీరంలో మార్పులు సహజంగా వస్తాయి. ఇలాంటి కొన్ని మార్పులకు కారణం ఇంకా సైన్సుకు అందలేదు. బిడ్డ పుడుతున్నాడనే ఆనందం ప్రధానం కానీ ఆడబిడ్డా, మగబిడ్డా అనే ధోరణి అలవరచుకోకూడదు. పై అపోహలో ఏమాత్రం నిజంలేదు.

గర్భిణీకి కడుపు తరచు దురదగా ఉంటే పుట్టే బిడ్డకు జుట్టు ఎక్కువ : గర్భవతికి నెలలు నిండుతుంటే కడుపు సైజు పెరిగి లోపల బిడ్డకు తగినంత చోటు సమకూరుతుంది. ఈ నేపథ్యంలో చర్మకణాలు సాగుతాయి. కొన్ని తెగుతాయి. అందుకే ఆ ప్రాంతం పొడిగా తయారయి ఇరిటేటింగ్‌గా ఉంటుంది. ఈ కారణంగా దురద ఉంటుంది. దురద తగ్గేందుకు కొబ్బరినూనె లేదా క్రీమును రాసుకోవాలి. అంతే ఇది కూడా కల్పితమే.

తొమ్మిది నెలలు నిండకుండా ప్రసవిస్తే కొడుకు, నిండితే కూతురు పుడతారు : భవిష్యత్ ముందుగా చెప్పడం అసాధ్యం. తొమ్మిది నెలలు నిండిన తర్వాత మగబిడ్డకు జన్మనిచ్చిన తల్లులు ఎందరో ఉన్నారు. తొమ్మిది నెలలు నిండకుండా ఆడపిల్లలను ప్రసవించిన వారు కూడా ఎందరో ఉన్నారు.

గర్భస్థ శిశువు చురుగ్గా ఉంటే ఆడపిల్ల మందకొడిగా ఉంటే మగబిడ్డ : గర్భస్థ శిశువు మందకొడిగా ఉంటే మగబిడ్డ అని మురిసిపోవద్దు. వెంటనే వైద్యుడి వద్దకు వెళ్లమని ఇదొక సంకేతం. అనుదినం గర్భస్థ శిశువు కదలికలు గర్భవతికి తెలియాలంటారు వైద్యులు. చురుకైన గర్భస్థ శిశువు కడుపులో తంతుంటే ఆ అనుభూతిని ఆనందించండి.

గర్భవతులు గమనించాల్సిన ముఖ్యవిషయాలు : గర్భం ధరించిన తర్వాత సొంతంగా మందులు వాడడం ప్రమాదం. కొన్ని మందులు గర్భస్థ శిశువుకు హాని చేస్తాయి. కొంత సమాచారం దిగువపట్టికలో చూడొచ్చు.

సమాచారం కోసం ఈ విషయాలు తెలియజేయబడ్డాయి. సాధారణంగా, చాలామంది మహిళలకు ఆరోగ్యవంతమైన శిశువులు జన్మిస్తారు. వైద్యుని పర్యవేక్షణలో తగిన జాగ్రత్తలు తీసుకునేవారికి ప్రసవం ఒక అద్భుతమైన అనుభవాన్ని అపైన ఆనందాన్ని కలిగిస్తుంది. ★

ఔషధం	గర్భస్థ శిశువుకు కలుగజేసే హాని
స్ట్రెప్టో మైసిన్	చెవులకు హాని చేస్తుంది
టెట్రాసైక్లిన్	పళ్లు, ఎముకల్లో అవక్షేపాలు ఏర్పరచి వాటి రంగును మార్చేస్తుంది
ఆస్ప్రిన్	రక్తస్రావానికి కారణమౌతుంది
మార్ఫిన్, బార్బిట్యురేట్లు	దిగులు కలిగిస్తుంది
కాంపోజ్	శిశువు శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది, కండరాలను బలహీనపరుస్తుంది
కక్కులకోసం వాడే థాలీడొమైడ్లు	అంగవైకల్యం కలిగిస్తాయి
కార్టిజోన్స్	అంగవైకల్యం, మరణం కూడా కల్గిస్తాయి
ఎమిడోపైరెన్స్	తెల్ల రక్తకణాల తయారీలో లోపాలు సృష్టిస్తుంది
యాంటీ మలేరియల్స్	గర్భవిచ్ఛిత్తి కలిగిస్తుంది

గర్భస్థ శిశువు జన్యులోపాలు పసిగట్టేందుకు జరిపే కొన్ని వైద్య పరీక్షలు :

పరీక్ష పేరు	జరిపే సమయం	పద్ధతి	రిస్కు	కనుగొనే లోపాలు
ఎఎఫ్‌పి	14-16వారాలు	తల్లిరక్తం	ఉండదు	మెదడు, వెన్ను, జీర్ణాశయంలోని లోపాలు
యామ్నియో సెంటసిస్	16-20 వారాలు	యామ్నియోటిక్ సంచి	గర్భవిచ్ఛిత్తి	డౌన్స్ సిండ్రోమ్
కోరియానిక్ విల్లీ	8-10 వారాలు	మూత్రోద్ధరణ నాళిక నుండి లాగుతారు	గర్భవిచ్ఛిత్తి	పుట్టుకతో ఉండే లోపాలు
ఫీటోస్కోపి	18-20 వారాలు	కడుపుగుండా ఫైబర్ ఆప్టిక్ గొట్టాన్ని పంపుతారు	రక్తస్రావం, ఇన్‌ఫెక్షన్	గర్భస్థ శిశువు రక్త పరీక్ష లోపాలకు చికిత్స

మసాలా లస్సీ

కావలసిన పదార్థాలు

పెరుగు - 3 కప్పులు, నీళ్లు - 2 కప్పులు
పచ్చిమిర్చి - 2, అల్లం - అరంగుళం ముక్క
కొత్తిమీర - కొద్దిగా, పుదీనా - కొద్దిగా
కరివేపాకు - 2 రెమ్మలు, మెంతులు - అరస్పూను
జీలకర్ర - అరస్పూను, ఉప్పు - తగినంత
ఐస్‌ముక్కలు - కొద్దిగా

తయారు చేసే విధానం



పచ్చిమిర్చి, కరివేపాకు, కొత్తిమీర, పుదీనా, జీలకర్ర, అల్లం, మెంతులను ముద్దగా నూరుకోవాలి. పెరుగులో రెండు కప్పుల నీళ్లు, ఉప్పు వేసి మజ్జిగలా బ్లెండ్ చేయాలి. ఇందులో ముందుగా చేసిపెట్టుకున్న పచ్చిమిర్చి అల్లం, కరివేపాకు ముద్ద, ఐస్‌ముక్కలు వేసి బ్లెండ్ చేస్తేచాలు. మసాలా లస్సీ రెడీ.



స్వీట్ రాగిమాల్ట్

కావలసిన పదార్థాలు

రాగిపొడి - 2 టేబుల్ స్పూన్లు, ఏలకుల పొడి - చిటికెడు, నీళ్లు - 1 కప్పు
పాలు - అరకప్పు, బాదం పొడి - 2 టేబుల్ స్పూన్లు, బెల్లం - 1 టేబుల్ స్పూను

తయారు చేసే విధానం

కొద్దిగా చల్లటి నీళ్లను తీసుకుని అందులో రాగిపొడి వేసి ఉండలు లేకుండా కలపాలి. గిన్నెలో నీళ్లు పోసి వేడి చేశాక అందులో రాగిపొడి కలిపిన నీళ్లు పోస్తూ గడ్డకట్టకుండా కలపాలి. బెల్లం కరిగించి పాకం చెయ్యాలి. ఇందులో బాదం పొడి వేసి ఈ మొత్తాన్ని ఉడుకుతున్న రాగి మిశ్రమంలో కలపాలి. సన్నటి మంటమీద ఉడికించాక ఏలకుల పొడి వేసి రెండు నిమిషాల తర్వాత దించాలి. ఈ రాగి మాల్ట్ వేడిగా తినొచ్చు. చల్లగా అయిన తర్వాత కూడా బావుంటుంది. ఇది చిక్కగా ఉంటే ఇష్టపడనివారు నీళ్లు ఎక్కువ కలుపుకోవచ్చు. నీళ్లకు బదులుగా మజ్జిగ వేసుకుంటే బెల్లం వేయకుండా ఉప్పు వేసుకోవాలి. రాగులలో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. ఇది ఎముకలను గట్టిదనాన్నిస్తుంది.

ఓట్స్ ముస్లీ

కావలసిన పదార్థాలు

ఓట్స్ - 1 కప్పు, నీళ్లు - 2 కప్పులు
పాలు - 1 కప్పు, ఆపిల్ - 1
నిమ్మరసం - 2 టీ స్పూన్లు
వేరుశనగపప్పు - 1టేబుల్ స్పూను
తేనె - 2 టీ స్పూన్లు

తయారు చేసే విధానం

ఓట్స్‌ని రాత్రంతా నీళ్లలో నానబెట్టాలి. యాపిల్ తొక్క తీసి ముక్కలు చేసి వాటికి నిమ్మరసం, వేరు శనగపప్పు, నానబెట్టిన ఓట్స్ కలపాలి. వీటిపైన పాలు, తేనె వేసి ఇస్తే పిల్లలు ఇష్టంగా తింటారు. ఓట్స్‌లో కొవ్వుపదార్థాలు ఉండవు. కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, కాల్షియం, విటమిన్లు సమృద్ధిగా లభిస్తాయి. వీటిలో యాపిల్ ముక్కలే కాదు, అరటిపండ్లు, ద్రాక్షా కూడా వేసుకోవచ్చు. ఇది ఉదయం అల్పాహారంగా గానీ, సాయంత్రం స్నాక్స్‌గా గానీ తీసుకోవచ్చు. పాలు కూడా ఇష్టమైతే వాడొచ్చు.

మిరియాల రసం

కావలసిన పదార్థాలు

టమాటాలు - 4
చింతపండు - చిన్న నిమ్మకాయంత
నీళ్లు - 4 కప్పులు, ఉప్పు - తగినంత
వెల్లుల్లి - 5 రెబ్బలు
మిరియాలు - అర టీ స్పూను
పసుపు - చిటికెడు
నూనె - 2 టీ స్పూన్లు
జీలకర్ర - 2 టీ స్పూన్లు
కరివేపాకు - 2 రెమ్మలు
ఆవాలు - చిటికెడు
మెంతులు - అర టీ స్పూను
ఎండుమిర్చి - 2
కొత్తిమీర - 1 కట్ట

తయారు చేసే విధానం

చింతపండు పది నిమిషాలు నానబెట్టి రసం తీయాలి. ఆ రసంలో టమాటాలు మెదిపి వడకట్టాలి. వెల్లుల్లి, మిరియాలు, జీలకర్ర కలిపి మెత్తగా నూరుకోవాలి. బాండీలో నూనె వేసి కాగాక ఎండుమిర్చి, ఆవాలు, జీలకర్ర, మెంతులు, కరివేపాకు వేసి తాలింపు పెట్టుకోవాలి. అందులో చింతపండు, టమాటా రసం పోసి ఒక పొంగు రానివ్వాలి. తర్వాత వెల్లుల్లి, జీలకర్ర, మిరియాల ముద్ద, పసుపు, ఉప్పు వేసి మళ్లీ ఒక పొంగురానివ్వాలి. ఈ రసం జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది.

చూద్దామా

చిరుజల్లుల హరివిల్లు


మెయిడ్ ఆఫ్ ది మిస్ట్

ఈ సారి మేం చూసిన ప్రదేశాలు ప్రత్యేకమైనవి. కాకపోతే న్యూయార్క్‌లో మాత్రం తనివి తీరేదాకా నిలబడి చూసే అవకాశం లేనందున కూసింత బాధకలిగింది. వాషింగ్‌టన్ డిసి, ఫిలడల్ఫియా, వైట్‌హౌస్... అన్నీ చుట్టేశాం. ఇంకా నయాగరా అందాలు వర్ణించడానికి ప్రపంచంలోని మాటలేవీ సరిపోవేమో! స్వయంగా వెళ్లి వీక్షించవలసిందే!!

న్యూయార్క్ తర్వాత "ది మెట్రోపోలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్" అనే సంగ్రహాలయాన్ని చూడ్డానికి వెళ్లాం. అందుకు మాకిచ్చింది గంటన్నర మాత్రమే. ఇంత తక్కువ సమయంలో అదంతా తిరిగి చూడ్డం సాధ్యమా? అనిపించింది.

మొదటి అంతస్తులో మనకు అమెరికన్ విభాగం, ఆయుధాలు, కవచాల విభాగం, ఆఫ్రికా విభాగం, ఈజిప్టు కళల విభాగం, ఐరోపా అలంకరణల విభాగం, ఐరోపా శిల్పకళ, గ్రీకు రోము చిత్ర శిల్ప కళల విభాగం, మధ్య యుగాల కళా విభాగం, ఆధునిక, సమకాలీన కళా విభాగం వంటివి చక చకా చూసుకుంటూ పోయాం. రెండవ అంతస్తులో 18వ శతాబ్దంలోని గొప్ప గొప్ప అమెరికా మూర్తి చిత్రాలు, వెండి, పింగాణీ, గాజుకు సంబంధించిన కళా సామగ్రి, ప్రాచీన ప్రాచ్య కళారీతులు, చైనా చిత్రకళ, సైప్రస్ కళాఖండాలు ఉన్నాయి. అవే కాకుండా 15వ శతాబ్ది నుండి 18 శతాబ్దం వరకు చిత్రించిన జపాన్, కొరియా, ఆధునిక సమకాలీన చిత్రకళలు, వివిధ రకాల వాద్య పరికరాలు, ఛాయా చిత్రాలు, దక్షిణ, ఆగ్నేయ ఆసియా చిత్రకళారీతులు కొలువైవున్నాయి.

అక్కడ్నుండి యు.ఎన్.ఓ. (ఐక్యరాజ్య సమితి) భవనం చూచేందుకు వెళ్లాం. ఆరోజు సెలవు కావడంతో దూరంనుండే వివిధ దేశాల బావుటాలను చూడాల్సివచ్చింది. ప్రపంచంలోని ధనవంతులు కూడా అక్కడి ఖర్చుకు తట్టుకోలేరేమో అనిపించేంతటి క విలాస వస్తువులను టైమ్ స్క్వేర్ ప్రాంతంలో చూడొచ్చు.

తర్వాతి రోజు బస్సు ఫిలడల్ఫియా వైపు వెళ్లింది. ఆ దారి పొడవునా అక్కడక్కడ చిరుజల్లులు పడుతున్నాయి. మేమున్న రెండు నెలల్లో ముసురు పట్టడం అన్నదే లేదు. వాళ్లకు ఇది వేసవి కాలం. అక్కడ వేసవిలో వర్షాలు పడతాయట. అవి మనకు చిత్తకార్తెలో పడే జల్లుల్లా వున్నాయి. ఒకవైపు వర్షం అంతలోనే ఎండ. ఫిలడల్ఫియాలో ఉదయం 9.30కు బస్సు దిగబోయే సమయానికి వర్షం. పది నిముషాలలో తగ్గిపోయింది. అక్కడ "లిబర్టీ బెల్" చూపెట్టారు. మన జానపద కథల్లో చదువుకున్నాం కదా. రాజులు ప్రజలకు న్యాయం చేసేందుకు కోటగుమ్మం ముందు గంట వేలాడదీస్తారు. అలాంటిదే ఈ గంట కూడా. దీన్ని చూసేందుకు కూడా డబ్బు చెల్లించాల్సిందే, పక్కనే లిబర్టీ హాలు, పాత కాంగ్రెస్ భవనం ఉన్నాయి. శ్రీకృష్ణరాయబారం నాటకంలో "అదిగో ద్వారక..." అంటూ పద్యం పాడి ద్వారకాదర్శనం గావించినట్లే మమ్మల్ని బయటి నుండే వాటిని చూడమన్నారు. పాత కాంగ్రెస్ భవనం అక్కడ ఎందుకున్నదీ అంటే ఒకప్పటి అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజధాని ఫిలడల్ఫియా.

ఈ ప్రాంతంలో ఒక గంట మాత్రమే గడిపి, మధ్యాహ్నానికి వాషింగ్‌టన్ డి.సి. చేరుకున్నాం. అక్కడ నేషనల్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్‌ను చూశాం. అందులో దేశ విదేశీ చిత్రకారులు, శిల్పకారుల 14000 చిత్రాలు, శిల్పాలు వున్నాయట. 19వ శతాబ్దం నుండి నేటి వరకు బాగా పేరున్నవాటిని అక్కడికి చేర్చారు. అందులో ఈజిప్టు, గ్రీసు, రోమ్, ఐరోపా, అమెరికా, ఆఫ్రికా, ఆసియా, జపాన్‌లకు చెందిన చిత్రాలు, శిల్పాలు అధికంగా వున్నాయి. సంవత్సరానికి 40,000లకు పైబడి సందర్శకులు దానిని సందర్శిస్తారు. పక్కనే వున్న నేషనల్ మ్యూజియం ఆఫ్ నాచురల్ హిస్టరీని కూడా చూశాం. అందులో భూగర్భ శాస్త్రానికి సంబంధించిన ఎన్నో వింతలు, విశేషాలు, రకరకాల శిలలు ఉన్నాయి.

తర్వాత దూరం నుండే పరిపాలనా భవనం, సుప్రీంకోర్టు, వైట్ హౌస్ చూశాం. జఫర్‌సన్ మెమోరియల్, లింకన్ మెమోరియల్, వియత్నాం, కొరియా యుద్ధవీరుల స్మారక చిహ్నాలు, వాషింగ్‌టన్ మాన్యుమెంటును మాత్రం దగ్గరనుండి చూశాం. ఇంకా చూడదగిన స్థలాలు ఇరవై వున్నాయి. కానీ మాకు కేటాయించిన ఒక్క రోజులో సగం మాత్రమే, అదీ అరకొరగా చూడగలిగాం. ఇంకా చూడాల్సిన వాటిలో నేషనల్ మ్యూజియం ఆఫ్ క్రైమ్ అండ్ పనిష్‌మెంట్, నేషనల్ మ్యూజియం ఆఫ్ ఉమెన్ ఇన్ ది ఆర్ట్స్, ఐన్‌స్టీన్ ప్లానిటోరియం, న్యూసియమ్, షేక్‌స్పియర్ లైబ్రరీ, నేషనల్ జూ వున్నాయి.

తర్వాతి రోజు నయాగరాకు ప్రయాణమయ్యాం. మార్గమధ్యంలో హర్షలే చాక్లెట్ ఫ్యాక్టరీ చూశాం. అది చాలా పెద్దది. ఎన్నో రకాల చాక్లెట్లు అక్కడ తయారవుతాయి. మన దేశంలో ఎగ్జిబిషన్లలో ఉండే రైలువంటి దానిలో సందర్శకులను కూర్చోబెట్టి చాక్లెట్ తయారీ విధానాన్నంతా గాజు గోడల మధ్య నుండి చూపెడుతూ తీసుకెళ్తారు. పాలు, కోక్, పంచదార

ఫిలడల్ఫియా


లింకన్ మెమోరియల్


వైట్‌హౌస్

సేకరణ నుండి చాక్లెట్ తయారీ, ప్యాకింగ్ అన్ని దశలూ చూడొచ్చు. అమెరికా వాళ్ల ఆహారంలో తీపి పాత్ర తెలిసిన వాళ్లకు హర్షలేచాక్లెట్ ప్రాధాన్యం ఏమిటో ఇట్టే తెలిసిపోతుంది.

ప్రయాణం మధ్యలో కార్నింగ్ మ్యూజియం ఆఫ్ గ్లాస్ వద్ద ఆగాం. అక్కడ గాజు ఫ్లవర్‌వేజ్ తయారీని ప్రదర్శిస్తున్నారు. అందులో ఒక ఫ్లవర్‌వేజ్ స్త్రీ వస్త్రధారణతో శాలువ కప్పుకున్నట్లుగా వుంది, 3500 ఏళ్ల నాటి ఈజిప్టురాజు తల, 4వ శతాబ్దం నాటి రోమన్‌గాజు కళాకృతి 'కేజ్‌కప్', రష్యాలోని జార్ కుటుంబం వాడిన 200 ఏళ్లనాటి గాజుబల్ల, గాజు పలకలపై రకరకాల చిత్రాలు ఇలా ఎన్నో దేశాలకు చెందిన రకరకాల గాజు వస్తువుల్ని చూస్తుంటే సమయం తెలీలేదు. అక్కడే రెండు గంటలు గడిపేశాం.

ఇక్కడ కులకర్ణిగారి కుటుంబం మహారాష్ట్ర ప్రాంతపు రొట్టె తినిపించి "అతిథి దేవోభవ" అని దీవించారు. అప్పుడు నేను వాళ్లతో అంతకంటే మంచి మాట "అన్నదాతా! సుఖీభవ" అన్నాను. వాళ్లు పకపకా నవ్వారు!

యాత్రలో అతి ప్రధానంగా భావించబడే నయాగరా జలపాతాన్ని చేరుకునేప్పటికి సాయంత్రం ఏడు దాటింది. అక్కడ ప్రధానంగా చూడవలసినవి ఐదు : 1. మెయిడ్ ఆఫ్ ది మిస్ట్ 2. కేవ్ ఆఫ్ ది విండ్స్ 3. నయాగరా డిస్కవరీ సెంటర్ 4. నయాగరా ఎక్వేరియం 5. నయాగరా సాహసగాథల సినిమా.

మొదటగా మేము మెయిడ్ ఆఫ్ ది మిస్ట్ దగ్గరికెళ్లాం. పేరుకు తగినట్లు నురగలు కక్కే నీళ్లలో జలపాతం రేపే తుంపరలలో బోటు ప్రయాణం. జలపాతం రెండు ప్రదేశాలనుండి దూకడాన్ని అక్కడ చూడొచ్చు. అమెరికా వైపు నుండి దూకే దాన్ని 'అమెరికన్ ఫాల్స్' అని పిలుస్తారు. కెనడా వైపు నుండి దూకే దాన్ని 'హార్స్ షూ ఫాల్స్' అని పిలుస్తారు. మెయిడ్ ఆఫ్ ది మిస్ట్ రెండు జలపాతాలను దగ్గరగా వీక్షించే అవకాశం కల్పించి తిప్పి తీసుకొస్తుంది. కెనడా వైపు నుండి జలపాతాన్ని చూడాలంటే కెనడా వీసా అవసరమవుతుందట. అమెరికా కెనడాలను కలుపుతూ వరదగుడి ఆకారపు వంతెన ఒకటుంది. కానీ దానిపైన ప్రయాణించాలంటే రెండు దేశాలకు వీసా ఉన్నవారికే అవకాశం ఉంది. కెనడా వైపునుండి జలపాత దృశ్యాలు మరింత సుందరంగా ఉంటాయన్నారు. ఆ నీటి తుంపరలపై సూర్యకిరణాలు పడి ఆకాశానికి అడ్డంగా నయాగరా నదిపై ఇంద్రధనస్సును సృష్టిస్తాయి. ఆ దృశ్యం తిలకించేందుకు అత్యద్భుతంగా ఉంది. హృదయం ఝల్లుమంది. అదో మైమరపు. రాత్రి తొమ్మిదిన్నర వరకు చీకటి పడదు కాబట్టి అప్పటి వరకు అక్కడే ఉండి చూశాం. ఆరువందల అడుగుల ఎత్తుకు ఎలివేటరులో వెళ్లి అక్కడి దర్శన శిఖరాన్నుండి నయాగరా అందాలను దర్శించవచ్చు. అక్కడి నుండి జలపాతం దృశ్యాలు, ఇంద్రధనస్సుని ఫొటోలు తీయొచ్చు. అయితే హెలికాప్టర్‌లో మరింత ఎత్తునుండి ఆ దృశ్యాన్ని చూడొచ్చన్నారు కానీ ఆ అవకాశం అందరికీ అందుబాటులో వుండదు కదా!

మన దేశంలో ఇంత పెద్దవి కాకపోయినా ఇంతకన్నా రమ్యంగా కనువిందుచేసే జలపాతాలున్నాయి. కానీ యాత్రికుల్ని ఆకర్షించే విధంగా వాటిని మలిచే శ్రద్ధ మనకు లేదనీ, అమెరికన్ల మాదిరిగా టూరిజంపై డబ్బు చేసుకునే విద్య మనకు వంటబట్టలేదని కొందరు భారతీయులు అక్కడ అనుకోవడం విన్నాను.

ఆరాత్రి బఫెలోలోని ఒక హోటల్లో బస. నయాగరాలో చూడాల్సినవి ఇంకా ఉంటే మరుసటి రోజు వాటిని చూశాం. అక్కడే ఉన్న మ్యాక్స్ థియేటర్లో నయాగరాకు సంబంధించిన 12000 సంవత్సరాల అద్భుత గాథను 40 నిమిషాల పాటు ప్రదర్శించారు. క్లీవ్ లాండ్ మీదుగా కొలంబస్ చేరుకున్నాను. కొలంబస్‌లో భరత్ తమ్ముడు శరత్, మా మరదలు కుమారుడు ఈశ్వరచంద్ కుటుంబాలున్నాయి. తర్వాత రోజు భరత్, కవిత, బసవపున్నమ్మ అంతా పియోరియా నుండి కొలంబస్‌కు చేరుకున్నారు. తర్వాత రోజు నాయగరాకు ప్రయాణమన్నారు. ఒక్క నయాగరాకే అయితే వాళ్లను వెళ్లి రమ్మనేవాణ్ణి. తిరుగు ప్రయాణంలో డా॥సుధీర్‌కుమార్, స్వరాజ్యలక్ష్మి గారింటికి వెళ్లాల్సి ఉంది. అందుకే మళ్లీ నయాగరాకు ప్రయాణమయ్యాను.

ఈ సారి నయాగరా ప్రయాణంలో ఉడుతల్ని చూశాను. వాటికి వీపుమీద చారలు లేవు. రామాయణగాథ గుర్తొచ్చింది. రాముడు అమెరికా రాలేదు కదా అని సమాధాన పరుచుకున్నాను. భరత్, కవిత దంపతులు బాగా ఎంజాయ్ చేశారు. రాత్రికి వాళ్లు రంగుల కాంతిలో నయాగరాను దర్శించడమే కాకుండా మందుగుండు సామగ్రి కాల్చడాన్ని కూడా చూశారట. ప్రయాణ బడలికతో నేనూ, నా భార్యా హోటల్లోనే ఉండిపోయాం.

రెండవ రోజు ఉదయం భరత్ కవితలు మమ్మల్ని నయాగరా చుట్టుపక్కల ప్రాంతం తిరిగి చూసేందుకు బస్సెక్కించి వాళ్లిద్దరూ "కేవ్ ఆఫ్ ది విండ్స్" వద్దకు వెళ్లారు. అదొక అద్భుత అనుభూతి. అక్కడ వందల అడుగులపై నుండి జలపాతం దూకుతుంది. మన మీద పడేవి కేవలం వర్షం తుంపరవంటిదే. అంటే మనం నీటి గుహలోకి ప్రవేశించినట్లే. అక్కడికి శ్రీమతిని తీసుకెళ్లడం కష్టమే. అందువల్ల మేం బస్సు ఎక్కి మిగతా ప్రాంతాలు చూసేందుకు వెళ్లాం.

ఎక్వేరియం చూద్దామని మ్యూజియం స్టాప్‌లో బస్సు దిగాం. ఎక్వేరియం వరకూ ఒక పెద్ద వంతెన మీదుగా నడిచి వెళ్లాం. అక్కడ వరకూ వెళ్లాక చికాగోలో ఎక్వేరియం చూశాంగా. దీన్ని చూసేదేముందిలే అన్నది. తిరిగి మ్యూజియం స్టాప్‌కు రాగానే అక్కడ రకరకాల పూలమొక్కలు, వాటి మధ్య మిరపమొక్కలు కనిపించాయి. దాని కాయలు కిందికి కాకుండా పైకి పొడుచుకు వచ్చినట్లున్నాయి. ఎదురుగా ఉన్న సమాచార కేంద్రానికి వెళ్లి వాటి పేర్లు "చిల్లీ చిల్లీ ఆర్నమెంటల్ పెప్పర్" అని తెలుసుకున్నాం. వాటి గింజలు ఎక్కడ దొరికేదీ చెప్పలేకపోయిందా సమాచార కేంద్రం అమ్మాయి. అయితే కొలంబస్ చేరుకున్న తర్వాత శరత్ ఈ మెయిల్ ద్వారా ఆర్డరు పెట్టి తెప్పించాడు. ఇంతకూ ఆ మొక్కలు మన దేశంలో పెరుగుతాయో లేదో!

- రావెల సాంబశివరావు



నయాగరా ఎక్వేరియం


వియత్నాం యుద్ధవీరుల స్మారక చిహ్నం


మెట్రో పోలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్



'హైస్పీడ్' చైనా

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఉద్యోగం. ఉక్కు నగరం విశాఖలో ఇల్లు. రెండు నగరాల మధ్య దూరం 847 కిలోమీటర్లు. రోజూ ఇంటి నుంచి ఉద్యోగానికి వెళ్లిరావడం సాధ్యమా? బస్సు, రైలు, సొంత వాహనంలో ఎలా వెళ్లినా అసాధ్యం. సొంతంగా విమానమో, హెలికాప్టరో కొనుక్కుంటే అప్పుడు సాధ్యం కావచ్చు. అయితే ఇదే పరిస్థితి చైనాలో ఉంటేమాత్రం విమానమో, హెలికాప్టరో లేకపోయినా అంతదూరంలోని ఆఫీసుకు రోజూ వెళ్లిరావడం సాధ్యమే! ప్రపంచంలోనే అత్యంత వేగంగా ప్రయాణించే రైళ్లను చైనా ప్రవేశపెట్టడమే ఇందుకు కారణం.

- ఆదిమూలం శేఖర్

ఆర్థికాభివృద్ధిలో అద్వితీయమైన వృద్ధి సాధిస్తున్న చైనా సాంకేతికంగానూ 'అగ్రదేశాలు' అందుకోలేనంత వేగంగా పురోగమిస్తోంది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా ప్రయాణించగల రైళ్లను (హైస్పీడ్ ట్రైన్లు) రూపొందించడం, ఆ వేగాన్ని తట్టుకోగల ట్రాక్ నిర్మించడం ద్వారా అమెరికా, జపాన్ వంటి దేశాలకు సరికొత్త సవాళ్లను విసురుతోంది. 12వ పంచవర్ష ప్రణాళికలోకి ప్రవేశిస్తున్న చైనా తన ప్రాధమ్యాలను స్పష్టంగా నిర్దేశించుని ఆ దిశగా అడుగులేస్తోంది. చైనా రూపొందించిన హైస్పీడ్ ట్రైన్లు, హైస్పీడ్ రైల్‌లైన్లు ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఆలోచింపజేస్తున్నాయి. అటువైపు పరుగులు తీసేలా చేస్తున్నాయి. గ్రేట్ వాల్ ఆఫ్ చైనా ఒక అద్భుతమైతే అందుకు మించిన అద్భుతాలను చైనా కమ్యూనిస్టు పార్టీ సారథ్యంలోని జనా చైనా సాధిస్తోంది. త్రీగోర్జెస్ డ్యామ్‌ను నిర్మించి 'ఔరా' అనిపించిన అరుణదేశం ఇప్పుడు మరో అద్భుతం వైపు ఉరకలేస్తోంది. హైస్పీడు ట్రైన్లు చైనా ఆధునికతకు చిహ్నంగా మారుతున్నాయి.

హైస్పీడ్ ట్రైన్

చైనా రూపొందించిన హైస్పీడ్ రైలు గంటకు 350 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోగలదు. చైనా రాజధాని బీజింగ్, సాంస్కృతిక రాజధాని షాంఘై మధ్య వచ్చే నెలలో (జూన్ 2011) ప్రారంభంకానుంది. ఈ రైలు అందుబాటులోకి వస్తే బీజింగ్ నుంచి 1300 కిలోమీటర్ల దూరంలో ఉన్న షాంఘైకి ఐదు గంటల్లో చేరుకోవచ్చు. ఇప్పుడు 18 గంటల సమయం పడుతోంది. మధ్య చైనాకు గుండెకాయలాంటి ఉహాన్ నుంచి 968 కిలోమీటర్ల దూరంలోని, చైనా దక్షిణతీరంలో ఉన్న గువాంగ్‌జుకు హైస్పీడ్ రైల్లో మూడు గంటల్లోపు వెళ్లిపోవచ్చు. ప్రస్తుతం పదిన్నర గంటల సమయం పడుతోంది. చైనా కొత్తగా రూపొందించిన ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన రైలును బీజింగ్-షాంఘై మధ్య విజయవంతంగా పరీక్షించారు. ఈ కొత్త రైలు ఫ్రాన్స్ టీజీవీ రైలు (272 కిలోమీటర్లు/గంటకు) వేగాన్ని అధిగమించింది.

హైస్పీడ్ రైల్వే లైన్లు

ప్రపంచంలోనే అత్యంత వేగంగా నడిచే రైళ్లను రూపొందించడం ఒక ఎత్తయితే...ఆ వేగాన్ని తట్టుకుని నిలబడగలిగే ట్రాక్ నిర్మాణం మరో ఎత్తు. ఇందులోనూ చైనా విజయం సాధించింది. హైస్పీడు రైళ్ల ప్రయాణించడానికి వీలుగా దేశంలోని రైలుమార్గాలను ఆధునికీకరిస్తోంది. ఈ లైన్లను 1,435 ఎంఎం స్టాండర్డ్ గేజ్‌తో నిర్మిస్తున్నారు. ఈ లైన్ల నిర్మాణానికి భారీగా వ్యయమవుతోంది. బీజింగ్-షాంఘై హైస్పీడ్ లైను నిర్మాణానికి 33 బిలియన్ డాలర్లు ఖర్చయ్యాయి. ఇది చైనా ప్రతిష్టాత్మకంగా నిర్మించిన త్రీ గోర్జెస్ డ్యాం హైడ్రాలిక్ ప్రాజెక్టు కన్నా ఎక్కువ వ్యయం. ఎందుకింత వ్యయం అవుతోందో ఉహాన్-గువాంగ్‌జు లైన్‌ను పరిశీలిస్తే అర్థమవుతుంది. ఈ లైన్‌లో 625 బ్రిడ్జీలు ఉన్నాయి. వీటి పొడవు 362 కిలోమీటర్లు. 221 టన్నల్స్ ఉన్నాయి. వీటి పొడవు 177 కిలోమీటర్లు. దీని నిర్మాణ వ్యయం 177 బిలియన్ యాన్స్. అంటే 17 బిలియన్ డాలర్లు.

అతిపెద్ద హైస్పీడ్ లైన్ నెట్‌వర్క్

హైస్పీడ్ లైన్ నెట్‌వర్క్‌లో చైనా ప్రపంచంలోనే అతి పెద్దదిగా ఉంది. ఇప్పటికే 8,358 కిలోమీటర్ల లైను ఉంది. 2012 నాటికి 13వేల కిలోమీటర్లు,

2020 నాటికి 16,000 కిలోమీటర్ల దూరం విస్తరించాలన్నది చైనా లక్ష్యం. ఇప్పుడున్నంత హైస్పీడ్ లైన్ నెట్‌వర్క్ మరేదేశంలోనూ లేదు. 2020కల్లా 90 శాతం చైనా ప్రజలను హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేయాలన్న పట్టుదలతో ఉంది. అందుకే చైనా ఈ ప్రాజెక్టులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. 2007లో చైనా హైస్పీడ్ రైల్ లైన్ల నిర్మాణం ప్రారంభించేనాటికి జపాన్ 2,400 కిలోమీటర్లతో ప్రపంచంలో అగ్రగామిగా ఉంది. అయితే నాలుగేళ్లలోనే జపాన్‌ను మించిపోయింది చైనా. తమ దేశం హైస్పీడ్ రైల్‌లైన్ల నిర్మాణాన్ని కొనసాగిస్తుందని ఇటీవలే నియమితులైన రైల్వే మంత్రి ప్రకటించారు.

విదేశాలకూ హైస్పీడ్ లైన్లు

చైనా తన హైస్పీడ్ ట్రైన్ నెట్‌వర్క్‌ను ప్రపంచంలోని 17 దేశాలతో అనుసంధానం చేయాలని గట్టిగా ప్రయత్నిస్తోంది. లండన్‌కు హైస్పీడు రైలు లైన్లను నిర్మించాలనేది కూడా ఇందులో వుంది. భారత్, పాకిస్తాన్లకూ అలాంటి లైన్లు వేయాలన్నది చైనా యోచన. ఈ ప్రయత్నాలు ఇప్పటికే మొదలయ్యాయి. చైనాలోని పలు నగరాలను మధ్య ఆసియా దేశాలు, ఇరాన్, యూరప్, రష్యా, సింగపూర్‌తో అనుసంధానించాలన్న యోచనలో ఉంది. ఇందులో దేశానికి దక్షిణం నుంచి కాంబోడియా, వియత్నాం మీదుగా సింగపూర్ లైనుకు సంబంధించి పనులు మొదలైనట్లు తెలుస్తోంది. భారత్, పాక్‌లోనూ హైస్పీడ్ ట్రైన్ లైన్ వేయనున్నారన్న వార్తలూ ఇటీవల వెలువడ్డాయి. బీజింగ్-లండన్ లైను సాకారమైతే ఆ రెండు నగరాల మధ్య రైలు ప్రయాణం కేవలం రెండు రోజులే. రైల్ లైన్ నిర్మాణం విషయమై పలు దేశాలతో చైనా చర్చలు జరుపుతోంది. ఇందులో తాము విజయం సాధిస్తామన్న గట్టి నమ్మకంతో చైనా పాలకులున్నారు.

వనరులకు టెక్నాలజీ

'వనరులకు టెక్నాలజీ' ప్రాతిపదికన హైస్పీడ్ ట్రైన్ టెక్నాలజీని ఇతర దేశాలకు ఇవ్వాలని చైనా యోచిస్తోంది. రానున్న కాలంలో అత్యంత కీలకం కాబోతున్న ఈ టెక్నాలజీని అందజేయడానికి డబ్బులకు బదులు తనకు అవసరమైన వనరులను తీసుకోవాలని భావిస్తోంది. ఈ సాంకేతిక పరిజ్ఞానం కావాలని ఇప్పటికే పలు దేశాలు చైనాతో సంప్రదింపులు జరుపుతున్నాయి. తన హైస్పీడ్ ట్రైన్లను ప్రపంచవ్యాప్తంగా చైనా ఎగుమతి చేస్తోంది. తమ దేశంలో

హైస్పీడ్ రైళ్ల టెక్నాలజీ

ఈ రైళ్ల ఆవిష్కరణ మొదలైనప్పటి నుంచి ఇందులో ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ఇందులో మాగ్‌లెవ్ (మాగ్నటిక్ లెవియేషన్) ముఖ్యమైంది. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్నీ చైనా ఉపయోగించుకుంది. ప్రస్తుతం దీనికన్నా మెరుగైన, అనుకూలమైన పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. స్టీలు చక్రాలు, స్టీలు పట్టాలను అధునాతన హైస్పీడ్ రైళ్లలో ఉపయోగిస్తున్నారు. జపాన్‌లోనూ దీనిపై ప్రయోగాలు జరుగుతున్నాయి. రైలు సిగ్నలింగ్ వ్యవస్థకు సంబంధించి హైస్పీడ్ రైళ్లకు అనుగుణంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. ఈ హైస్పీడు రైళ్లు వేగంగా ప్రయాణించడమేగాదు విలాసవంతమైన సదుపాయాలూ ఉన్నాయి. విమానాలతో పోల్చదగ్గ సీట్లు, క్యాబిన్లు ఉన్నాయి.

హైస్పీడ్ రైళ్ల చరిత్ర

హైస్పీడ్ రైళ్ల చరిత్ర 1930వ దశకంలోనే మొదలైంది. 20వ శతాబ్దం ప్రారంభం నుంచే రైలు ప్రయాణంపైన, రైలు రవాణాకు ఆదరణ మొదలైంది. ఈ క్రమంలోనే సాంప్రదాయ రైళ్ల స్థానంలో వేగంగా ప్రయాణించే రైళ్ల ఆవిష్కరణ ప్రయత్నాలు మొదలయ్యాయి. 1939లో ఇటలీలో ఈటీఆర్ 200 పేరుతో ప్రవేశపెట్టిన రైలు గంటకు 203 కిలోమీర్ల వేగంతో ప్రయాణించింది. అయితే రెండో ప్రపంచ యుద్ధం మొదలవడంతో ఈ రైలును మరింత అభివృద్ధి చేసే ప్రయత్నాలకు బ్రేక్ పడింది. రెండో ప్రపంచ యుద్ధానంతరం అతివేగంగా నడిచే రైళ్లపై అనేక దేశాల్లో ఆసక్తి మొదలయింది. ప్రధానంగా జపాన్ ఎక్కువ ఆసక్తి ప్రదర్శించింది. దీంతో 1957లో రొమాన్స్‌కార్ 3000 ఎస్ఎస్ఈ పేరుతో ఓ రైలును ప్రవేశపెట్టింది. దీని గరిష్ట వేగం గంటకు 145 కిలోమీటర్లు. ఇది నేరో గేజ్ (1.4 మీ.) రైలు. అంతలోనే అంటే మూడేళ్ల అంతరంలో 1960లో జపాన్ మరో రైలును ప్రవేశపెట్టింది. 217 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ రైలును ఆ నాటి ఒలంపిక్స్‌ను దృష్టిలో ఉంచుకుని త్వరగా ప్రారంభించారు. అధికారికంగా 1964లో ఇది మొదలయింది. టోక్యో, ఒసాకో మధ్య నడిచింది. దీనికి షింకాన్సేన్ అని పేరుపెట్టారు. షింకాన్సేన్ అంటే జపాన్ భాషలో 'కొత్త ప్రధాన మార్గం' అని అర్థం. రైలు రూపం, వేగాన్ని బట్టి 'బుల్లెట్ ట్రైన్'గా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. జపాన్ బుల్లెట్ రైలు పట్టాలెక్కాక యూరప్ దేశాల్లోనూ హైస్పీడ్ రైళ్లు మొదలయ్యాయి. అయితే 1980దాకా యూరప్‌లో హైస్పీడ్ రైళ్ల వ్యవస్థ పూర్తిస్థాయిలో అభివృద్ధికాలేదు. యూరప్ దేశాల్లో రైళ్లు గంటకు 200 కిమీ వేగంతో ప్రయాణిస్తున్న తరుణంలో అమెరికా రైళ్ల గరిష్టవేగం గంటకు 145 కిలోమీటర్లు మాత్రమే. ప్రస్తుతం జపాన్, స్పెయిన్, జర్మనీ, బెల్జియం, బ్రిటన్ తదితర దేశాల్లో హైస్పీడ్ రైళ్లు నడుస్తున్నాయి. ఇదే సమయంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న చైనా హైస్పీడ్ రైళ్లను పెద్ద ఎత్తున ప్రవేశపెడుతోంది. 2008 ఒలంపిక్స్ సందర్భంగా బీజింగ్-తైయాన్‌జిన్ మధ్య గంటకు 217 మైళ్ల వేగంతో ప్రయాణించగల రైలును ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి చైనా ఈ రంగంలో ఎదురులేకుండా దూసుకుపోతోంది.



షాంఘై బీజింగ్ రైల్వే లైన్

హైస్పీడ్ రైలు నడుపుతూ ఉంటే...

భవిష్యత్తు హైస్పీడ్ రైళ్లదే

భవిష్యత్తు హైస్పీడు రైళ్లదే అనడంలో సందేహం లేదు. ఇప్పటికే హైస్పీడ్ రైల్ లైన్ల వ్యవస్థ ఉన్న దేశాలు దాన్ని మరింత విస్తరించాలనుకుంటున్నాయి. ఉదాహరణకు యూరప్ మొత్తాన్ని హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్‌తో అనుసంధానించాలని యూరోపియన్ యూనియన్ యోచిస్తోంది. ఇందుకు 2025 సంవత్సరాన్ని గడువుగా అనుకుంటోంది. ఇక చైనా 17 దేశాలకు ఇలాంటి వ్యవస్థను నిర్మించాలని భావిస్తోంది.

వెయ్యి కిలోమీటర్ల మేర హైస్పీడ్ ట్రైన్ లైన్ నిర్మించేందుకు చైనాతో కజకిస్థాన్ ఇటీవలే ఒప్పందం కుదుర్చుకుంది. హైస్పీడ్ రైళ్ల ఉత్పత్తికి చైనా చాంగ్‌చున్‌లో రైల్వే ఇండస్ట్రీ పార్కు ఏర్పాటు చేసింది. ఇటు దేశీయ, అటు ప్రపంచ మార్కెట్ అవసరాల కోసం ఇక్కడ హైస్పీడ్ రైళ్లు తయారు చేస్తున్నారు. ఏడాదికి 1,500 హైస్పీడ్ రైళ్లు, 1200 బులెట్ ట్రైన్లు, 3వేల సబ్‌వే ట్రైన్లు ఈ రైల్వే ఇండస్ట్రియల్ పార్కులో ఉత్పత్తికానున్నాయి. రానున్న కాలంలో హైస్పీడ్ రైళ్లు కావాలంటే చైనాను ఆశ్రయించక తప్పనిపరిస్థితి ఏర్పడుతోంది.

ఇతర దేశాల పరుగులు

చైనా ఆవిష్కరించిన హైస్పీడ్ ట్రైన్ టెక్నాలజీతో ఇతర దేశాలూ పరుగులు మొదలుబెట్టాయి. అమెరికాలో హైస్పీడ్ రైల్ ప్రాజెక్టుల కోసం ఆ దేశ అధ్యక్షుడు ఒబామా మార్చి నెలలో 8 మిలియన్ డాలర్లు ఇస్తున్నట్లు ప్రకటించారు. ప్రపంచంలోనే మొట్టమొదటి హైస్పీడ్ రైల్ లైన్లు వేసిన జపాన్ కూడా ఇప్పుడు వెనుకబడిపోయింది. ఆ దేశంలో టోక్యో–ఒసాకా మధ్య హైస్పీడ్ రైల్ లైన్‌ను తొలుత నిర్మించింది. ప్రస్తుతం గంటకు 185 మైళ్ల వేగంతో ప్రయాణించే బుల్లెట్ రైళ్లు అక్కడ నడుస్తున్నాయి. ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, బెల్జియం, బ్రిటన్ దేశాల్లోనూ హైస్పీడ్ రైళ్లు నడుస్తున్నా వాటి సగటు వేగం గంటకు 150 మైళ్లు మాత్రమే. చైనా మాత్రం హైస్పీడ్ రైళ్లను, లైన్లను భారీగా అభివృద్ధిచేసి అన్ని దేశాలనూ దాటుకుని ముందుకెళ్లిపోయింది.

టెక్నాలజీకి పెద్దపీట

2011–2015 మధ్య అమల్లోవుండే 12వ పంచవర్ష ప్రణాళికకు చైనా తుదిరూపం ఇచ్చింది. ఇందులో టెక్నాలజీకి అత్యధిక ప్రాధాన్యతనిచ్చింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఉత్పత్తి శక్తులను పెంచుకోవాలన్నది చైనా కొత్త పంథా. ఇప్పటిదాకా ప్రపంచానికంతటికీ ఉత్పాదక సరుకులు అందించే ఫ్యాక్టరీలా ఉంది చైనా. ఇకపై ప్రపంచానికి కొత్త సాంకేతిక ఆవిష్కరణలు అందించే పాత్ర పోషించాలని నిర్ణయించింది. ఇందులోభాగంగా ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశీయంగా అభివృద్ధి చేసుకోవాలనుకుంది. తనవద్ద లేని సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరమైతే పశ్చిమ దేశాల నుంచి దిగుమతి చేసుకోవాలని, ఆపై ఆ పరిజ్ఞానాన్ని సొంతంగా రూపొందించుకోవాలని నిర్ణయించింది. ప్రస్తుత హైస్పీడు రైలింజన్ టెక్నాలజీని ఇదే పద్ధతిలో చైనా తయారుచేసుకుంది. జపాన్, జర్మనీ, ఫ్రాన్స్ టెక్నాలజీలను ఆధారంగా చేసుకుని సొంత టెక్నాలజీని అభివృద్ధి చేసుకుంది. 12వ పంచవర్ష ప్రణాళిక లక్ష్యాలు రానున్న ఐదేళ్లలో చైనాను ఆధునిక దేశంగా తీర్చిదిద్దేదిగా కనిపిస్తోంది.

హైస్పీడ్ రైళ్లపై మక్కువ ఎందుకు?

ఇందుకు వేగం, ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచాల్సి రావడం ప్రధానమైన కారణాలు కాగా ఇతర అంశాలూ ఉన్నాయి. పెరుగుతున్న ప్రజా రవాణా అవసరాలను తీర్చడానికి రైల్వేలే అనువైనవిగా భావిస్తున్నారు. రోడ్డు, ఆకాశయానంతో పోల్చితే ఇందులో అనేక సౌలభ్యాలు, ప్రయోజనాలున్నాయి. పలు దేశాల్లో ఇప్పటికే రోడ్డు రవాణా పరంగా జరగాల్సినంత విస్తరణ జరిగిపోయింది. అందుకే రైళ్లపైన దృష్టి మళ్లింది. కార్లు వంటి వాహనాలకు కేటాయించిన స్థలం రైళ్లకు కేటాయిస్తే అనేక రెట్లు ఎక్కువగా ప్రజారవాణా వ్యవస్థను మెరుగుపరిచే అవకాశముంది. విమానాశ్రయాల్లాగా రైల్వే స్టేషన్లకు ఎక్కువ భూభాగం అవసరం ఉండదు. అందుకే నగరాల మధ్యన, తక్కువ స్థలం ఉన్నచోట కూడా రైల్వే స్టేషన్లు నిర్మించవచ్చు. ఇక ఇంధనాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవడంలోనూ ఇతర రవాణా వ్యవస్థలతో పోల్చితే రైళ్లలో అవకాశాలెక్కువగా ఉన్నాయి. ఇలాంటి అనేక కారణాల రీత్యా ఇప్పుడు హైస్పీడ్ రైళ్లపైన కేంద్రీకరిస్తున్నారు.

బుల్లెట్ రైలు...హైస్పీడ్ రైలు...తేడా ఏంటబ్బా...

మొట్టమొదటి హైస్పీడ్ ట్రైన్ జపాన్‌లోనే రూపొందడం ఆశ్చర్యమేమీ కాదు. ఫ్రెంచి వారు తమ తొలి హైస్పీడ్ రైళ్లు ఎక్కడానికి పదిహేడు ఏళ్ల మునుపే అంటే 1964లో జపాన్‌లో టోక్యో, ఒసాకా మధ్య షింకాన్సేన్ (జపాన్‌లో బుల్లెట్ ట్రైన్‌కు పేరు) నడిచింది. అవసరం ఆవిష్కరణకు తల్లి లాంటిదంటారు. పూర్తిగా చమురు దిగుమతులపై ఆధారపడిన జపాన్‌కు ఇంధన ఆదా జాతీయ హోదా అయింది. విమానాలు, ఇతర రవాణా వాహనాల కన్నా హైస్పీడ్ రైళ్లు తక్కువ ఇంధనాన్ని వాడతాయి. ఆ ఇంధనం కూడా దిగుమతి చేసుకుంటున్న చమురుపై ఆధారపడి లేదు. ఈ లాభాల నేపథ్యంలో బుల్లెట్‌లా దూసుకుపోయే .. తద్వారా ఇంధనాన్ని, సమయాన్ని ఆదా చేసే షింకాన్సేన్‌లు రూపొందాయి. అయితే అప్పటి బుల్లెట్ ట్రైన్లు గంటకు 210 కిమీ వేగాన్ని అందుకునేవి. ఆ తర్వాత అభివృద్ధి చేసిన 300, 500, 700 శ్రేణులు గంటకు 285 కిమీ వేగంతో ప్రయాణిస్తున్నాయి. ఈ బుల్లెట్ ట్రైన్లు కేవలం విద్యుత్‌తోనే నడుస్తాయి (25000 వోల్టుల ఎసి విద్యుత్). మామూలు రైళ్లలాగా ఉక్కుపట్టాల మీదే కదులుతాయి (అతుకులు లేని పట్టాలు). ఇప్పుడు వచ్చే మాగ్-లెవ్ రైళ్లు అయస్కాంత శక్తి సాయంతో పట్టాలకు కొద్దిగా 'పైన' పయనిస్తాయి. పట్టాల పక్కన, రైలు కింద వున్న అయస్కాంతాలు రైళ్లను నడిపిస్తాయి. అందువల్ల ప్రస్తుతం వున్న పట్టా వ్యవస్థలు ఈ రైళ్లకు పనికి రావు. ఎంత బుల్లెట్ రైలు అయినా పట్టాలను ఆనుకొని వెళ్లాల్సిందే. అవి అంత వేగంలో బ్రేక్ వేసిన కొద్ది దూరంలో క్రమంగా వేగం తగ్గి ఆగుతాయి. కానీ మాగ్-లెవ్ రైళ్లకు ఆ సమస్య లేదు. అసలు పట్టాలకే ఆనుకోని కారణంగా అవి సత్వరమే ఆగగలవు. అయితే ఆ తర్వాత అవి తగిన అయస్కాంత శక్తి పొందే వరకు (తేలడానికి) చక్రాల సాయంతో పట్టాలపై నడవవలసిందే.

బుల్లెట్ ట్రైన్ లోపల...

-యాజీవ్

హైస్పీడ్ రైళ్లపై చైనాకు ఎందుకంత ఆసక్తి?

చైనా హైస్పీడ్ రైళ్లపైన ఆసక్తి చూపడంలో ప్రధానంగా మూడు అంశాలున్నాయి. ప్రజారవాణా వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు దేశంలో ఏ ప్రాంతానికైనా హైస్పీడ్ రైలుగానీ, విమానాలుగానీ, మెరుగైన రోడ్డుమార్గంగానీ ఉండాలనుకుంటోంది. అలాగే రానున్న కాలంలో ఇప్పటిలాగే ఆర్థికాభివృద్ధి సాధించాలంటే ఇంధనాన్ని పొదుపుగా, సమర్థవంతంగా వినియోగించుకోవాలని భావిస్తోంది. కాలుష్యరహితంగా, వాతావరణ స్నేహపూరిత సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాలకు వస్తున్న వలసలను నివారించాలని గట్టిగా కృషి చేస్తోంది. వీటిన్నింటినీ సాధించడానికి హైస్పీడ్ రైళ్లను ఓ మార్గంగా చైనా భావిస్తోంది. అదేవిధంగా రానున్న కాలంలో అత్యంత శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా బలోపేతం కావాలనుకుంటోంది. ఇందుకు కూడా హైస్పీడ్ రైల్ వ్యవస్థ ఉపయోగపడుతుంది. ఇంత దూరదృష్టి, అభివృద్ధిపై దృక్పథంతో చైనా అడుగులేస్తోంది.

అందరికీ అందుబాటులో హైస్పీడు రైళ్లు

ఇప్పటిదాకా ఉన్న హైస్పీడు రైళ్లు చాలా విలాసవంతంగా ఉండి సామాన్యులకు అందుబాటులో లేవన్న ఆరోపణలున్నాయి. దీనిపైనా చైనా ప్రభుత్వం దృష్టి సారించింది. స్పీడ్ ట్రైన్లలోని విలాసవంతమైన సీట్లు, క్యాబిన్లను తొలగించి వాటి స్థానంలో మామూలు సీట్లు అమర్చినట్లు వార్తలొచ్చాయి. దీనివల్ల రైళ్లలో ఎక్కువ మంది ప్రయాణికులకు చోటు కల్పించడంతో పాటు ఛార్జీలు తగ్గించడానికి వీలు ఏర్పడింది. దీనిపై చైనా పౌరుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

మనమెక్కడ?

చైనా హైస్పీడ్ ట్రైన్లలాంటి వాటి గురించి మనదేశంలో ఇప్పట్లో ఊహించనేలేము. పరిమాణం పరంగా చూస్తే ప్రపంచంలో రైల్వేలలో అమెరికా, రష్యా, చైనా తరువాత భారత్ ఉంది. దేశంలో 1,08,706 కిలోమీటర్ల రైల్వే లైను ఉంది. ఇక వేగపరంగా చూస్తే దేశంలో బ్రహ్మాండమని చెప్పుకునే శతాబ్ది ఎక్స్‌ప్రెస్ సగటు వేగం గంటకు 80 కిలోమీటర్లు మాత్రమే. మన దేశంలోని రైల్వే లైన్లలో బ్రిటీష్‌కాలంలో నిర్మించిందే ఎక్కువ. స్వాతంత్ర్యానంతరం 10,677 కిలోమీటర్ల ట్రాక్ మాత్రమే నిర్మించాం. అంటే మన లైన్లు ఎంత పురాతనమైనవో అర్థం చేసుకోవచ్చు. చైనాలాంటి హైస్పీడ్ ట్రైన్లు నడపాలన్న ఆలోచన కూడా మన పాలకులకు ఉన్నట్లు కనిపించదు.

ఏదేమైనా ఇతర దేశాల నుంచి తెచ్చుకున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఆ దేశాలనే మించిపోయేలా స్వీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించుకోవడంలోనే సోషలిస్టు చైనా విశిష్టత కనిపిస్తుంది. దేశాన్ని సాంకేతికంగానూ అద్వితీయమైన శక్తిగాను తీర్చిదిద్దాలన్న లక్ష్యానికి ఈ రైళ్లు నాందిగా కనిపిస్తున్నాయి. తిరుగులేని ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న చైనా ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో రానున్న కాలంలో హైస్పీడు రైలుకన్నా వేగంగా దూసుకుపోతుందనడంలో సందేహం లేదు.

★

కథ



స్మితాస్త్రం

- కాశీవఝ్ఝుల రమానరసింహం

భర్త ఎంత కుదుపుతున్నా పరిమళకి మెలకువ రావట్లేదు.

'టైము ఎంతయ్యిందనుకుంటున్నావ్? బారెడు పొద్దెక్కింది. లేచి కాఫీ పెడుదూ....' అన్నాడతగాడు. మెల్లగా కళ్లు తెరచిన పరిమళ "మీకేనా? వేడి, వేడిగా కాఫీ తాగాలని నాకు మాత్రం వుండదా..?" అంది ముసుగు తియ్యకుండానే.

"నువ్వు మంచం మీద కూర్చుని మహారాణి ఫోజు పెడితే ఇవాళ కుదరదోయ్... మన చిట్టితల్లి పుట్టినరోజు. అందుకే పెందళాడే లేస్తావేమోనని తాపత్రయ పడుతున్నా... కానీ ప్చ్.." అంటూ అసంతృప్తి నటించాడు.

అంతే చప్పున లేచి "అవును కదూ.. ఇవాళ బంగారు స్మిత పుట్టినరోజు. దానికేనేవిటీ... ఇవాళ నాకూ పుట్టినరోజే. అది పుట్టి, నన్ను అమ్మను చేసింది. దాని పరిభాషలో ఇవాళ నాకూ హ్యాపీబర్త్‌డేనే... చిట్టితల్లి ఏడుస్తున్నట్టు లేదే. బంగారుతల్లిలా ఉందే.. అబ్బో... ఎంతాశ్చర్యం.." అంటూ స్నానాలగదిలోకి తొంగి చూసింది పరిమళ.

"ఇవాళేనేంటి..నేను రోజూ గుడ్‌గర్ల్‌నే" అని బుంగమూతి పెట్టింది స్మిత సదరు చిట్టితల్లి.

"ఏవుందీ.. కుంకుడుకాయల జోలికి పోలేదివాళ. షాంపుతోనే తలంటు చేయిస్తానని చెప్పాలే.." అంటూ పయిట కొంగు బొడ్లో దోపుకుని నూనెగిన్నె చేత్తో పట్టుకుంది చిట్టితల్లి బామ్మ.

పీటమీద కూర్చున్న కూతురికి అత్తగారి చేత ముందస్తుగా మాడున చమురు పెట్టించింది పరిమళ. మనవరాలి తలపై తడుతూ "మా బంగారమే.. పెద్దయి మంచి చదువులు చదివి అమ్మలా చక్కగా ఉద్యోగం చేసి, అష్టయిశ్వర్యాలతో నిండునూరేళ్లూ బతకాలి" అంటూ ఆప్యాయంగా ఆశీర్వదించింది పరిమళ అత్తగారు.

"నువ్వు చెప్పినట్టే బాగా చదువుతాను లేవే.. కానీ బామ్మోయ్.. నేను అమ్మలా ఉద్యోగం చెయ్యనే చెయ్యను. నాకు ఉద్యోగం అంటే చాలా అసయ్యం" అక్కసుగా అంది స్మిత. కూతురి మాటలు విన్న పరిమళ మొహం చిన్నబోయింది. అప్పుడే అక్కడికి వచ్చిన స్మిత తండ్రికి మాత్రం చచ్చేంత కోపం వచ్చింది. కానీ తల్లి సైగతో తమాయించుకుని.. కూతురి మాడున చమురు అద్ది "ఊ.. గబగబా కానియ్యి..." అంటూ హాల్లోకి వెళ్లిపోయాడు. ఏదో యాంత్రికంగా కూతురి తలమీద యింత నూనె అద్ది పరిమళ వంటింట్లోకెళ్లి పోయింది.

'మీ అమ్మకి నువ్వంటే ఎంతిష్టమో' అంటున్న బామ్మని "ఏంకాదు.." అంటూ మధ్యలోనే అడ్డుకుంది. "నీ మాటలకేం గానీ చూడు మీ అమ్మ ఎంత మంచిదో... నీగురించి ఏమందో తెలుసా?! ఇవాళ పిల్లని ఏడిపించకండి. ఆ కుంకుడుకాయలతో కాకుండా షాంపుతో తలంటండి అని చెప్పింది" అంటూ షాంపూ పాకెట్ మనవరాలి చేతిలో పెట్టింది.

దాన్ని చూడగానే స్మిత కళ్లు నక్షత్రాల్లా మెరిసిపోయాయి. సంతోషంతో పెదవుల మీద నవ్వులు పూచాయి. విప్పారిన మనవరాలి మొహం చూసి.. హమ్మయ్య.. మళ్లీ మూడ్ మారకుండా పని కానిచ్చెయ్యాలి అనుకుంటూ మనవరాలి వంటికి నూనె పట్టించ్చింది. "ఇంకా ఏవందో తెలుసా మీ అమ్మ! అనవసరంగా ఇంతింత నూనె రాసి స్మితని నాననివ్వకండి. జలుబు చేస్తే ఆనక వాళ్ల పెదనాన్నవాళ్లు వస్తే ఆడుకోడానికి వీలవదు. ఏదో దూమెరుగ్గా రాసి, కాస్త నలుగు పెట్టి స్నానం కానిచ్చెయ్యండి" అంది. చూసావా నీకిష్టం లేదని మీనాన్నకి తెలీకుండా ఇదంతా రహస్యంగా నాతో చెప్పి చేయిస్తోంది. నీకిష్టం లేనివేవీ మీ అమ్మకీ ఇష్టం లేదు. మీ అమ్మకి నువ్వంటే చాలా చాలా ప్రేమ అని కదా దీనర్థం. అని మాటల్లో పెట్టి నలుగు కానిచ్చేసింది.

తల రుద్దబోతున్న బామ్మ 'నాకంటే అమ్మకి ఉద్యోగవంటేనే చాలా యిష్టం' అన్న మనవరాలి మాటలతో అవాక్కయింది. ఆపట్టున అలా కొద్దిసేపు నిలబడి పోయింది. అంతలోనే తేరుకుని "ఏం పిల్లోనమ్మా... ఒర్లి రాలుగాయి...." అని గొణుగుతూ పిల్ల తలని బరబరా రుద్ది స్నానం అయిందని పించింది బామ్మ. 'ఆగు' అని గదమాయిస్తున్నా వినకుండా స్మిత తూనీగలా పరుగెట్టుకెళ్లి తల్లిని వాటేసుకుంది. "ఒళ్లు తుడుచుకోకుండా ఇంట్లోకి వెళ్లకూడదని ఎన్నిసార్లు చెప్పినా వినవు గదా" అంటు తల్లిని అంటిపెట్టుకున్న మనవరాలిని రెక్కపట్టుకుని ఇవతలికి లాగి ఒళ్లూ, తలా తుడిచి బుల్లి నిక్కరేసింది. డైనింగ్ టేబుల్ కింద ఉన్న చిన్నకుర్చీ ఇవతలికి లాగి ఓ వారగా వేసి అందులో మనవరాలిని కుదేసింది బామ్మ.

అంతలో పరిమళ వచ్చి అత్తగారి చేతికి కాఫీ గ్లాసు అందించింది. నానా హైరానా పెట్టేసుంటుంది మిమ్మల్ని. మీరు కూడా స్నానం చేసెయ్యండి అత్తయ్యా. అలా తడి ఒంటితో ఉండకండి అంటూ అత్తగారికి నీళ్లు తోడి, తన పనిలో నిమగ్నమైంది.

"అసలే ఇవాళ నీకు పనెక్కువ. రెండోసారి కాఫీలెందుకు చెప్పు" అంటూ వేడిగా ఉన్న కాఫీని ఊదుకుంటూ తాగుతోంది. "ఎంతోపికే తల్లీ నీకు. అలా పరుగులు పెడుతూ పనులు చెయ్యకే... ఉత్తమనిషివి కూడా కాదు.." అంటూ కుర్చీలోంచి లేస్తున్న బామ్మని చూసి స్మిత

"అయ్యో... అయ్యో... ముందు నువ్వు గభాల్న కుర్చీలోంచి లేవకు. నువ్వు కూడా ఒర్లి మనిషివి కాదు కదా. మా అమ్మ పొట్ట కంటే నీదే చాలా పెద్దదిగా ఉందే బామ్మా. నువ్వు కూడా అయిరానా పడకు" అంది.

ఆ వెంటనే "ఏవిటో ఈ పెద్దాల్లు, అస్సలుకి అర్థమే అవరు" అని చిన్నగా విసుక్కుంది కూడానూ. అప్పుడెప్పుడో అమ్మని పని చెయ్యొద్దని చెప్పి, నెమ్మదిగా నడిపించుకుంటూ మంచమ్మీద కూర్చోబెట్టి బామ్మ అమ్మ బొజ్జ నిమురుతుంటే, అమ్మ అదేదో సిన్మాలో ఈరోయిన్‌లా పోండత్తయ్యా అంటూ నవ్వితే అబ్బా... మా అమ్మెంత బావుందో కదే బామ్మా అని అడిగింది.

అప్పుడు ఆ బామ్మ ఏవందీ "పొట్టలో వున్న పాపాయి గురించి మాట్టాడితే అలాగే అందంగా నవ్వుతారు" అంది కదా. అదే సంగతి పక్కింటి బాబిగాడితో అంటే "పోదూ బడాయి. మీ అమ్మేనేంటీ మా అమ్మకూడా బావుంటుంది..." అని గొప్పలు పోయాడు. తనకు కోపం వచ్చి వాడితో పచ్చి కొట్టి, వాడి అక్క దగ్గరకెళ్లి కూర్చుంది. అప్పుడు వాళ్లక్క జంతికలు పరపరా నములుతూ... "అది కాదే స్మితాలూ...పిల్లలందరి అమ్మలూ బావుంటారే..." అంది. "అవునా..." అని తను బోల్డు ఆశ్చర్యపడితే "బోదురుకప్పలా నోరలా

తెరవకే... మళ్లీ చెబుతున్నా అమ్మలందరూ బావుంటారే... ఎందుకంటే వాళ్లంతా అమ్మలే కదా... అందుకన్నమాట...." అనలేదూ కళ్లొత్తుకుంటూ... అని జ్ఞాపకం చేసుకుంది చిట్టితల్లి.

పెదనాన్నలకీ, నాన్నకీ, అత్తకీ ఈ బామ్మకూడా అమ్మే కదా! జుట్టు తెల్లగా సున్నం పిడతలా వున్నా, ఒళ్లు బంతిలా గుండ్రంగా వున్నా నా కళ్లకి బామ్మ కూడా అందంగా కనపడుతుంది. మరి నాన్నకెలా వుంటుందో గానీ..."

ఇలాగే ఆలోచిస్తున్న స్మిత మళ్లీ ప్రస్తుతంలోకి వచ్చి "అమ్మని అన్నట్టే తనని కూడా అంటే బామ్మ సిగ్గుపడి నవ్వుతుంది గదా! అప్పుడు "బామ్మా నువ్వు కూడా నా కళ్లకి మా అమ్మలా అందంగా కనపడుతున్నావు...." అని అందాం అనుకుంది. కానీ బామ్మ నవ్వలేదు సరిగదా. నన్ను తోసేసింది. ఏమిటో ఈ పెద్దాళ్లు అని చిరాకుపడుతున్న చిట్టితల్లి ఫోను రింగవడంతో ఒక్కంగన వెళ్లి, రిసీవరు తీసుకుని "యస్ నేనే" అంది సీరియస్‌గా. మరి వాళ్ల నాన్న ఫోను మాట్లాడేటప్పుడు అలాగే అంటాడు మరి.

"ఫోను చేసింది ఏ పెద్దమనిషో ఏమిటో... రింగయితే చాలు తనకే అన్నట్టుగా తయారైపోతుంది" అని విసుక్కుంటున్న తండ్రిని చూసి "నాకే నాన్నా...ఇవాళ నువ్వు ఫోను తియ్యకు. అందరూ నాకే చేస్తారు... ఇవాళ నా హేపీ బర్త్‌డే కదా! చూడు అమ్మమ్మ చేసింది. నాకు హేపీబర్త్‌డే చెప్పింది తెలుసా..." అని కళ్లు గుండ్రంగా తిప్పుతూ చెప్పి, మళ్లీ ఫోనులో మాట్లాడ్డం మొదలు పెట్టింది.

"అవును గానీ, అమ్మమ్మా నువ్వెప్పుడొస్తావ్? ఈసారికి నేను అక్కడికి రావట్లేదు. నాకిక్కడ చాలా పనులున్నాయ్...నువ్వు సాయంకాలం పార్టీకి వస్తున్నావు కదా! వచ్చేప్పుడే బోల్డు చీరలు తెచ్చేసుకో... ఎంచక్కా యిక్కడే వుండొచ్చు...నువ్వు మా యింట్లో వుంటే నీకో సీక్రెట్ చెప్తా... నేనింతవరకూ ఎవ్వరికీ చెప్పలేదు. నిజ్జం అమ్మమ్మా... మా ఫ్రెండ్ బాబిగాడు లేడూ. వాడిక్కూడా చెప్పలేదు... నిజ్జం...ప్రామిస్... ఏవిటీ మీ బామ్మక్కూడా చెప్పలేదా అంటున్నావా.. ఓ పిచ్చి అమ్మమ్మా... అసలా రహస్యం బామ్మ గురించే..." నోటికి చెయ్యి అడ్డం పెట్టుకుని నెమ్మదిగా చెప్పి బై చెప్పేసి ఫోను పెట్టేసింది.

బామ్మ గురించిన రహస్యం అన్నమాట ఆ పెద్దావిడ చెవిన పడనే పడింది.

"ఓరి దేవుడోయ్...ఇదెక్కడి వరస...చూడబోతే యిది నలుగుర్లోనూ నన్ను పరువుగా బతకనిచ్చేట్టు లేదు. పదిమందీ వచ్చే రోజు కూడానూ..." అని లబోదిబో మంటూ పొట్ట సవరించుకుని పవిట కొంగుని బొడ్లో దోపుకుంది గాభరాగా. 'కోడలికి వంటలో సాయం చెయ్యాలి...' ఇంకా ఎన్నో అనుకున్న బామ్మగారు చెయ్యాడకా కాలాడకా బిక్కచచ్చిపోయి కుర్చీలో కూలబడింది నీరసంగా.

"ఈ పిల్లదానితో వేగలేకుండా ఉన్నాను. నేనిక్కడుండన్రా అబ్బాయ్. మీ చెల్లెలి దగ్గరకెళ్తాను. నన్ను బండెక్కించెయ్..." అంది కొడుకుతో.

"సరేలే అమ్మా... పసిపిల్లతో ఏంటీ... నువ్వూ... నీ అమాయకత్వమూనూ..." అని తల్లిని సముదాయించాడు.

"బామ్మకసలు తువ్వాలు చుట్టడం కూడా రాదు" అనుకుంటూ ఆ తువ్వాలుని మొత్తానికే తీసిపారేసి కాళ్లూపుకుంటూ కుర్చీలో కూర్చుంది, బుల్లి నిక్కరొకటేసుకుని.

"ఇవాళ నా హేపీ బర్త్‌డే కదా! అమ్మే డ్రెస్ చేస్తుంది" అని గెంతుతూ తల్లి దగ్గర కెళ్లి మారాం చెయ్యసాగింది.

"అలాగేలే... ఇవాళ మీ అమ్మ నీ కోసం ఆఫీసు మానేసింది. నన్ను ఆఫీసుకు పంపి, నీ పనులన్నీ చేస్తుంది" అని కూతురితో రాజీ కుదుర్చుకున్నాడు.

తనకి వంటలో సాయం చెయ్యకూడదూ... అలా చేస్తే చంటిదానితో కాసేపు గడపొచ్చు అనుకుంటుంది పరిమళ ఎప్పుడూనూ. కానీ మనసులో మాట భర్తకి ఎప్పుడూ చెప్పదు. పోనీ తన పని అయ్యేంత వరకైనా పసిదాన్ని దగ్గర కూర్చోబెట్టుకోవచ్చు కదా! పిల్లలపై తల్లిదండ్రులకి కాక యింకెవరికుంటుంది ప్రేమ. అయితే ఆ ప్రేమని పిల్లలకి తెలిసేలా బహిర్గతపరచాలి. అప్పుడే వారికి తల్లిదండ్రుల ప్రేమపట్ల విశ్వాసం కలుగుతుంది. లేనిపోని పేచీలు పెట్టకుండా హాయిగా ఉంటారు. చెప్పింది వింటారు. ఏవిటో యిలా అనుకోవడమే గానీ ఇవన్నీ అమలు చేద్దామనుకునేసరికి ఏవో ఇబ్బందులు. ఉన్న ఒక్క పిల్లతోనే తృప్తిగా గడపలేకపోతుంటే మధ్యలో ఈ అవాంతరం ఒకటి... ఛా... తనేవిటీ...యిలా ఆలోచిస్తోంది. తప్పుకదూ అనుకుంటూ గబగబా భర్తకి క్యారేజీ కట్టి, పెద్దవాళ్లిద్దరికీ అన్నం వడ్డించింది. వాళ్ళు తింటున్నప్పుడే పిల్లక్కూడా పెట్టేస్తే బావుంటుంది. ఈ పూటన్నా తన చేత్తో దానికి అన్నం పెడితే కాస్త తృప్తి వుంటుంది. స్మిత కూడా సంతోషిస్తుంది. ఇలా అనుకుంటున్న పరిమళ ఠక్కుమన్న శబ్దానికి తెల్లబోయి తలెత్తి చూసింది.

"చూడు పరిమళా దీని ఆగడం. పుట్టిన్రోజు గదా ముందు తీపి తినిపించి తర్వాత అన్నం పెడదాం అని పాయసం పెట్టబోయా. అంతే నా చేతిని విసురుగా తోసేసి ప్లేటుని నేలకేసి కొట్టింది. బాప్‌రే... ఈ పిల్లని సాకడం నావల్ల కాదు. వాళ్ళ అమ్మమ్మ దగ్గరికి పంపించెయ్యి. ఆవిడ రిటైర్డ్ టీచరు గదా. పిల్లని ఒక పద్ధతిలో పెంచుతుంది" అని తీర్మానించేసింది.

"మీ అమ్మ చేసిన అప్పచ్చులన్నీ మేం తినేస్తాం లే..." అని స్మితకి చెప్తూ భోజనానికి ఉపక్రమించింది.

కూతురి చేష్టలకి కోపం వచ్చినా నిభాయించుకున్నాడు. "పిల్లా యిది...బాప్‌రే బాప్ పిశాచి...పిల్లపిశాచి" అని నోరు పారేసుకున్నాడు పరిమళ భర్త.

"నేనేం కాదు. అన్నీ నువ్వే...నీకు బోల్డు గర్వం...నాన్నా. మీ అమ్మ ఎప్పుడూ నీ కోసం ఇంటోనే వుంటుందని...నీకు బోల్డు గర్వం. నా బర్త్‌డే రోజున కూడా బామ్మే నాకు అన్నం పెట్టాలా? నా హేపీ బర్త్‌డే రోజున కూడా మా అమ్మ నాకు ఏవీ పెట్టదా...? అంటే అమ్మకి నేనంటే యిష్టం లేదా...వూ...వూ..." అంటూ వెక్కిళ్లు పెట్టింది. దగ్గరికి రాబోయిన తల్లిని తోసేసింది. ఆ విసురుకి పరిమళ పడిపోయేదే భర్త పట్టుకోకపోతే.

"నువ్వేం నాకొద్దు ఫో...నాకు బామ్మే కావాలి. నాకు బామ్మే కావాలి. బామ్మలకే పిల్లలంటే ప్రేమ. అందుకే వాళ్ళు ఎప్పుడూ ఇంటోనే వుంటారు. పిల్లల కోసం అప్పచ్చులు చేస్తారు. బోలెడు కథలు చెబుతారు. టీవీలో కార్టూన్లు చూడనిస్తారు. అమ్మా నాన్నా అయితే ఎప్పుడూ చదువూ...హోమ్‌వర్క్ చెయ్యి అంటారు. ఇంకా యిలా వుండు... అలా వుండకు అంటూ కోప్పడుతూనే వుంటారు. మన పక్కింటి బాబిగాడూ... మా స్కూల్లో పద్మ, మా రిక్షాలో అందరూ అమ్మా నాన్నల కంటే బామ్మలే మంచోళ్లర్రా అంటారు. మేం ఇంటికొచ్చేసరికి 'మా బాబే...మా నాయనే...మా తల్లే' అంటూ ఎదురొచ్చి ముద్దులు పెట్టుకుంటారు. యింకా చాలా...చాలా చేస్తారు. అని చెప్పారు. నిజమే నాకు అమ్మొద్దు...బామ్మే కావాలి" అని కాళ్ళు నేలకేసి బాదుతూ, పెద్దగా ఏడుపు మొదలుపెట్టింది. మనవరాలిని చూస్తే బామ్మకి బాధేసింది. బామ్మే కావాలి అన్నందుకు చెప్పలేనంత సంతోషమూ కలిగింది.

తింటున్న కంచంలో చెయ్యి కడిగేసుకుని ఆదరాబాదరాగా చేతులు కొంగుకు తుడుచుకుని "మా తల్లే... మా బంగారమే... నా అమ్మే...దా... నీకు బామ్మే కావాలా....ఇదిగో బామ్మ...నీకోసమే వచ్చింది చూడు" అని మనవరాలి బుగ్గలు పుణికి ముద్దులు పెట్టేసుకుంది అలవిమాలిన ప్రేమతో.

అప్పుడు చిట్టితల్లి కూడా బామ్మని ఆ బుగ్గమీదా ఈ బుగ్గమీదా ఎడాపెడా ముద్దులు పెట్టేసుకుంది. నేనెప్పుడూ నీ జట్టేనే బామ్మా... నాకు నువ్వంటేనే యిష్టం. ఈ అమ్మ నన్ను స్కూలుకి రిక్షాలో పంపించేసి...తను మటుకు నాన్నతో కలిసి బండిమీద ఆఫీసుకెళ్లిపోతుంది. వాళ్లిద్దరూ ఒక జట్టు కామోసు" అని అడిగింది బామ్మని.

"మరే..." అంది బామ్మ ఏవంటే ఏం కొంప మునుగుతుందో అని.

★



వైద్య ప్రయోగాల విజ్ఞాన సర్వస్వం
ది కాక్రేన్ లైబ్రరీ

-వి.నవీన్ కుమార్

'కాఫీ తాగితే మహిళలు బాగా పనిచేస్తారు'...
'స్థూలకాయం గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది'
'ధూమపానం వల్ల రొమ్ము క్యాన్సర్ పెరుగుతుంది'
'హెచ్ఐవి రోగుల్లో గుండెపోటు ఎక్కువ'
'కొలస్ట్రాల్ శాతాన్ని తగ్గించే సోయా'

ఇలాంటి శీర్షికలు మనం తరచూ వార్తాపత్రికల్లో చూస్తుంటాం. ఇవన్నీ వైద్యపరిశోధనకు సంబంధించినవి. వివిధ అంశాలకు సంబంధించి పరిశోధకుల బృందం మనుషులపై పరిశోధన, అధ్యయనం, వైద్య ప్రయోగాలు చేస్తుంది. సాధారణంగా సదరు ఫలితాలను అంతర్జాతీయ సెమినార్లలో ప్రవేశపెడతారు. వైద్య వార్తాపత్రికల్లోనూ ప్రచురిస్తారు. ఈ వార్తలను పత్రికల్లో చదివిన తర్వాత పాఠకుడికి చాలా సందేహాలు కలుగుతాయి. ఒక్కోసారి నిజమేనేమోనని నమ్ముతాడు. ఎందుకంటే ప్రఖ్యాత వైద్య విశ్వవిద్యాలయాలు, నిష్ణాతులైన వైద్యనిపుణులు పరిశోధనలు చేశారు కాబట్టి. కానీ ఇలాంటి పరిశోధనలు, వైద్య ప్రయోగాలు, అధ్యయనాల్లో చాలా వరకు పక్షపాత ధోరణితో ఉంటాయి. వీటికి పేరెన్నికగన్న ఔషధ పరిశ్రమలు నిధులు సమకూరుస్తాయి. ప్రయోగఫలితాలు తమకు అనుకూలంగా వుండేలా చూసుకుంటాయి. దీనివల్ల వారి ఔషధాల మార్కెటింగ్ మెరుగవుతుంది. వైద్యులు కూడా ఈ ఫలితాల ఆధారంగా ఔషధాలను రాస్తుంటారు. వైద్యుడు చెప్పాడని రోగి మందులు వాడడం, వైద్యనిర్ధారణ పరీక్షలు చేసుకోవడం యాథవిధిగా కొనసాగుతోంది. ఇవన్నీ విశ్వసనీయమైనవి నమ్మేదెలా? కచ్చితమైన ఫలితాలు, ఎటూ మొగ్గు చూపకుండా నిష్పాక్షికమైన రుజువులతో కూడిన ప్రయోగ ఫలితాలు ఎక్కడ లభిస్తాయి? అవి సామాన్యుడికి అర్థమవుతాయా? రోగికి జరుగుతున్న వైద్యం ఎంత వరకు కరెక్ట్? ఎంత సమర్థవంతంగా ఉంటుందా వైద్యం? సురక్షితమేనా? ఇలాంటి ప్రశ్నలు సామాన్యుడి మనసును తొలుస్తుంటాయి. ఈ ప్రశ్నలన్నింటికి ఒకే సమాధానం అది 'ది కాక్రేన్ లైబ్రరి'. అంటే వైద్య ప్రయోగాల విజ్ఞాన సర్వస్వం అని చెప్పుకోవాలి. ఈ లైబ్రరీ విశేషాలు తెలుసుకుందాం...

మన దేశంలో ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించేది చాలా తక్కువే. అది ఏమాత్రం సరిపోదు. అలాంటి ప్రభుత్వం మన కోసం ఒక మంచి పని చేసిందని చెప్పాలి. నిష్పాక్షికమైన, కచ్చితత్వం, పారదర్శకత ఉన్న వైద్య ప్రయోగాలను సమీక్షించి ఆ సమాచారాన్ని కాక్రేన్ లైబ్రరీ ఒక సైట్‌లో నిక్షిప్తం చేస్తోంది. దానిపేరు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.దికాక్రేన్‌లైబ్రరీ.కామ్. (www.thecochranelibrary.com). సాధారణంగా వైద్య ప్రయోగాలు, పరిశోధనలు, అధ్యయనాలు వంటివి నిర్వహించిన తర్వాత వీటి ఫలితాలను నిక్షిప్తం చేసే వెబ్‌సైట్లు ఉన్నాయి. అయితే ఇవి అందరికి అందుబాటులో ఉండవు. కేవలం వైద్య విశ్వవిద్యాలయం, వైద్యనిపుణులు, పరిశోధకులు మాత్రమే ఈ సమాచారాన్ని అధ్యయనం చేసే వీలుంది. అదీ సభ్యత్వం తీసుకున్నవారికి మాత్రమే. ఈ సభ్యత్వం ఉచితం కాదు. రుసుము చెల్లించాల్సిందే. భారత వైద్య పరిశోధన మండలి (ఐసిఎంఆర్) కాక్రేన్ లైబ్రరిలోని వైద్య ప్రయోగ ఫలితాలను మన దేశ ప్రజల కోసం అందుబాటులోకి తీసుకురావాలని భావించింది. ఇందుకోసం భారత ప్రభుత్వం కాక్రేన్ లైబ్రరీ సైట్‌ను కొన్నది. ఈ విషయంలో మనదేశం చరిత్ర సృష్టించిందనే చెప్పాలి. ఎందుకంటే తక్కువ ఆదాయం ఉన్న దేశాల్లో మన దేశం ఒకటి. వైద్యరంగంలో జరుగుతున్న అభివృద్ధిని ఎప్పటికప్పుడు మనకు అందించడానికి ఐసిఎంఆర్ సముచిత నిర్ణయం తీసుకుందనడానికి ఇదొక ఉదాహరణ. ఇంటర్నెట్ కనెక్షన్ ఉన్న ప్రతీ ఒక్కరూ ఎలాంటి రుసుము చెల్లించకుండా ఈ ఆన్‌లైన్ సైట్‌లోని సమాచారాన్ని పొందొచ్చు. ఇందులో ఉన్నది విశ్వసనీయ సమాచారం. స్వతంత్రమైనది కూడా. అంతేకాక సురక్షితమైంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని తాజాపరుస్తుంటారు. వైద్యంలోని అన్ని రకాల ప్రత్యేక విభాగాలు.. సర్జరీ, నర్సింగ్, దంతవైద్యం, శస్త్రచికిత్స తర్వాత పునరావాసం (రిహాబిలిటేషన్) వంటివే కాక ఇంకా ఇతర అంశాలను ఇందులో పొందుపరిచారు.

తొలి అడుగు

జబ్బు వస్తే 100 శాతం నయం అవుతుంది, ఫలానా వ్యాధికి గ్యారంటీగా చికిత్స ఉందని ఎవరైనా అంటే అది నమ్మకూడదు. వైద్యంలో కొన్ని పరిమితులున్నాయి. అందుకే ఆసుపత్రుల్లో చేసే వైద్యచికిత్సలు పనిచేస్తాయా? ఒక వేళ పనిచేస్తే ఎంత సమర్థవంతంగా పనిచేస్తాయి? ఎంత సురక్షితమైనవి వంటి వాటిగురించి విశ్వసనీయ సాక్ష్యాలు అందుబాటులో ఉన్నాయి. వైద్యసంరక్షణలో ఇలాంటి అంశాలు అందుబాటులో ఉంచడం తొలి అడుగుగా భావించొచ్చు. అందుబాటులో వున్న మెరుగైన, సమర్థవంతమైన, సురక్షితమైన సాక్ష్యాధారిత సమాచారాన్ని అందించే వన్-స్టాప్ పోర్టబుల్‌గా కాక్రేన్ లైబ్రరీని పేర్కొనొచ్చు. ఆరోగ్యరంగ నిపుణులు, ఆరోగ్య విధానాలు రూపొందించేవారు, రోగులకు ఇది మధ్యవర్తిత్వం వహిస్తుందనే చెప్పాలి. ఆరు డేటాబేస్‌ల నుంచి సేకరించిన సమాచారంతో కాక్రేన్ లైబ్రరీని ఏర్పాటు చేశారు. ఇది 'ద కాక్రేన్ డాటాబేస్ ఆఫ్ సిస్టమేటిక్ రివ్యూస్ (సిడిఎస్ఆర్)లోని అంతర్భాగం. ఏప్రిల్ 2011లో కాక్రేన్‌లో 6500 వ్యాసాలున్నాయి. ఇలాంటి సమీక్షలు సేకరించడంలో ఇది ప్రపంచంలోనే

పెద్దది.

ప్రయోగాల సమాచారం

వైద్యరంగం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుంది. ప్రపంచవ్యాప్తంగా నిరంతరం ఔషధాలు, వైద్యచికిత్స విధానాలు, వైద్యపరికరాలపై నిరంతరం పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య ప్రయోగాలు జరుగుతుంటాయి. అయితే, ఈ ప్రయోగాల ఫలితాలు పేజీలకు పేజీలుంటాయి. వీటిని చదవడం, అర్థం చేసుకోవడం సామాన్యుడి తరం కాదు. అయితే ఈ ఫలితాలను విశ్లేషించి వైద్య ప్రయోగాల ఫలితాలను సంక్షిప్తం చేసి, ఒక పద్ధతి ప్రకారం సైట్‌లో పొందుపరిచారు. ఇవి ఎంత వరకు సమర్థవంతమైనవి, సురక్షితమైనవో లైబ్రరీ సంపాదకులు అంచనా వేస్తారు. ఈ సమీక్షలతోపాటు నిర్దిష్టమైన వ్యాధులను, ఇతర అనారోగ్య పరిస్థితులను కనుగొనడానికి ఎంత కచ్చితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలో సిడిఎస్‌ఆర్ ఒక పద్ధతి ప్రకారం వివరిస్తుంది.

నిష్పక్షపాతం

వైద్య పరిశోధనలు, వైద్య ప్రయోగాలు చాలా వరకు కొన్ని ఔషధ సంస్థలు, ఇతర వైద్య పరికరాల కంపెనీలు నిర్వహిస్తుంటాయి. నిధులను కూడా అందిస్తుంటాయి. ప్రయోగ ఫలితాలు తమ ఉత్పత్తులకు లాభం చేకూర్చేవిధంగా ఉంటాయి. ఈ ఫలితాలు డాక్టర్లను సైతం ప్రభావితం చేస్తాయి. కానీ కాక్రేన్ లైబ్రరీలోని సమీక్షలు నిష్పక్షపాతంగా ఉంటాయి. ఎటువైపు మొగ్గుచూపవు. ఇదే దీని ప్రత్యేకత. నిర్ణయించిన కొన్ని పద్ధతుల ద్వారా సమీక్షలను తయారు చేశారు. దీని వల్ల పక్షపాతంగా వ్యవహరించే, ఫలితాలను ప్రభావితం చేసే అవకాశాలు తగ్గుతాయి. 'కాక్రేన్ కొలాబరేషన్'కు చెందిన సభ్యులు ఈ సమీక్షలను తయారు చేస్తారు. ఈ అంతర్జాతీయ సంస్థలో 100 దేశాల నుంచి 28,000 మంది పరిశోధకులు, ప్రయోగాలు నిర్వహించేవారు, వైద్య నిపుణులు ఉన్నారు. అయితే వీరికి ఏ ఔషధ కంపెనీ సంస్థకు ఎలాంటి నిధి ఇవ్వడం లేదనేది గమనించాలి. అంటే స్వతంత్రంగా వ్యవహరిస్తారన్నమాట.

ప్రామాణిక పద్ధతులు

ఒక పరిశోధన, అధ్యయనం, వైద్య ప్రయోగం చేసిన తర్వాత పరిశోధన బృందం తయారు చేసే ఫలితాల నివేదికలు వందల పేజీలలో ఉంటాయి. పరిశోధన మొదలు పెట్టిన దగ్గరి నుంచి పూర్తయ్యే వరకు ఏం చేశారో చాలా వివరంగా, గణాంకాలతో, అభిప్రాయాలతో, గత పరిశోధన ఫలితాలను కోట్ చేస్తూ పొందుపరుస్తారు. ఇన్ని పేజీలను చదవడం సామాన్యుడికి అసాధ్యం. అందుకే పటిష్టమైన సంపాదక బృందం సమీక్షలు చేస్తుంది. శాస్త్రీయ, అత్యున్నత కచ్చితత్వం కోసం, పారదర్శకత ఉట్టిపడేలా బృందం ప్రామాణిక పద్ధతులను పాటిస్తుంది. ఇతర పరిశోధన ఫలితాల సమీక్షల కన్నా ఇవి చాలా విశ్వసించదగ్గవి, ముఖ్యంగా ఔషధరంగ పరిశ్రమ ఫలితాలతో పోలిస్తే. ఈ సమీక్షలను ఎన్నో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ప్రధానంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ వంటివి ఉపయోగిస్తాయి. క్షయ, మలేరియా, పునరుత్పత్తి ఆరోగ్యం, శిశు జననం, క్యాన్సర్, రక్తహీనత, పోషకాహార రుగ్మతలు, ఇతర జబ్బులకు సంబంధించిన మార్గదర్శకాలను తయారు చేసేందుకు ఈ సమీక్షలు తోడ్పడతాయి.

సామాన్యుడికి అర్థమయ్యే రీతిలో...

వైద్యపరిభాష సామాన్యుడికి అర్థం కాదు. పైగా వైద్య ప్రయోగాల నివేదకలు, ఫలితాలు ఇంగ్లీషులో ఉంటాయి. వీటిని అర్థం చేసుకోవడం అంత సులభం కాదు. ఇంగ్లీషు పరిజ్ఞానం ఒక్కొక్కరికి ఒక్కో స్థాయిలో ఉంటుంది. అందుకే కాక్రేన్ లైబ్రరీలోని అన్ని రకాల సమీక్షలను మూడు భాగాలుగా విభజించారు. అవి సంక్షిప్త రూపంతోపాటు పూర్తి సమీక్షలుగా ఉంటాయి. వీటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సంక్షిప్తరూపంలో ఉన్న సమీక్షలు సామాన్యుడికి కూడా సులభంగా అర్థమయ్యే భాషలో ఉన్నాయి. కాక్రేన్ లైబ్రరీలో 'కాక్రేన్ సెంట్రల్ రిజిస్టర్ ఆఫ్ కంట్రోల్డ్ ట్రయల్స్ (సెంట్రల్)' ఉన్నాయి. ప్రచురితమైన, ప్రచురితంకాని వైద్య ప్రయోగాల నుంచి, కాక్రేన్ కొలాబరేషన్‌లోని గుర్తించిన గ్రూపుల నుంచి సేకరించిన సమాచారం ఇందులో పొందుపరిచారు. 'సెంట్రల్'లో ప్రస్తుతం 6,45,000 వైద్య ప్రయోగాలకు సంబంధించిన రికార్డులున్నాయి. పబ్‌మెడ్ లేదా ఇతర సంస్థలు నిర్వహించే డేటాబేస్ కన్నా ఇది చాలా పెద్దది. మన దేశం, ఇతర దక్షిణ ఆసియా దేశాల్లో నిర్వహించిన 2500 వైద్య ప్రయోగాల రికార్డులు 'సెంట్రల్'లో ఉన్నాయి. ఇలాంటివి పబ్‌మెడ్, ఇతర డేటాబేస్‌లలో లభించవు.

దక్షిణాసియా డేటాబేస్

ఈ వైద్య ప్రయోగాలు మన దేశంలోని దక్షిణాసియా కాక్రేన్ కేంద్రం గుర్తించినవే. ఇవి సౌత్ ఏసియన్ డేటాబేస్ ఆఫ్ కంట్రోల్డ్ క్లినికల్ ట్రయల్స్ (www.cochrane-sad-cct.org). లో లభిస్తాయి. 'కాక్రేన్ సిస్టమిక్ రివ్యూస్'తో వీటిని జతపరిచారు. దీని వల్ల మన దేశ ఆరోగ్యసంరక్షణకు చెందిన సమీక్షల ఔచిత్యం పెరుగుతుంది. కాక్రేన్ లైబ్రరీలో ' డాటాబేస్ ఆఫ్ అబ్‌స్ట్రక్ట్స్ ఆఫ్ రివ్యూస్ ఆఫ్ ఎఫెక్ట్స్' (డేర్) కూడా ఉంది. ఇతర వారపత్రికల్లో ప్రచురితమైన సమీక్షలను పద్ధతి ప్రకారం సంక్షిప్తీకరించారు. కాక్రేన్ మెథడాలజీ రిజిస్టర్ (సిఎంఆర్)లో ప్రచురణ సంస్థల గ్రంథపట్టిక (బైబిలోగ్రఫి) సమాచారం ఉంది. సిఎంఆర్‌లో వైద్య ప్రయోగాలు నిర్వహించడంలోని పద్ధతులను వెల్లడించే నివేదకలున్నాయి. హెల్త్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ (హెచ్‌టిఎ)... ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణతో ప్రమేయమున్న వైద్య, సామాజిక, నైతిక, ఆర్థిక అంతస్సూచనలను అంచనా వేస్తుంది. ఎన్‌హెచ్‌ఎస్ ఎకనమిక్ ఎవల్యూషన్ డాటాబేస్ (ఇఇడి)... ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణతో ప్రమేయమున్న నాణ్యమైన-విలువైన ఆర్థిక అంచనాలకు సంబంధించిన వివరాలను అందిస్తుంది. ఇక 7వ డాటాబేస్ కాక్రేన్ కొలాబరేషన్‌కు తోడ్పడుతున్న 81 గ్రూపులకు సంబంధించిన సమాచారాన్ని అందిస్తుంది.



కాక్రేన్ ఆన్‌లైన్ సైట్

మన దేశం కూడా....

ఆరోగ్య రంగంలో ఇతరులు నిర్వహించిన పరిశోధనలను మన దేశం ఉపయోగించుకోవడమే కాక ఆరోగ్య సంరక్షణతో ప్రమేయమున్న వాటికి సహకరించడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాం. టాప్-50 సమీక్షలపై కాక్రేన్ కొలాబరేషన్ గణాంకాల ప్రకారం... ఏప్రిల్ 26, 2011న 'జింక్ ఫర్ ద కామన్ కోల్డ్' అనే సమీక్షకు ప్రపంచవ్యాప్తంగా 3363 హిట్స్ వచ్చాయి. ఈ సమీక్షలను పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చండీగఢ్‌కు చెందిన బృందం నిర్వహించింది. కాక్రేన్ లైబ్రరీ ఫిబ్రవరి 2011లో విడుదల చేసిన పత్రిక ప్రకటనకు అనూహ్య స్పందన వచ్చింది. ప్రకటన ప్రచురితమైన మొదటి రెండు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా మీడియాలో దీనిపై 800 వ్యాసాలు, 10 రోజుల తర్వాత 1000 రిఫరెన్స్‌లు వచ్చాయి. 2008లో పూర్తి వ్యాసాన్ని కాక్రేన్ లైబ్రరీ సైట్ నుంచి మన దేశంలో ప్రతి ఏడు నిమిషాలకు డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. ఆ ఏడాది 70,090 డౌన్‌లోడ్స్ జరిగాయి. ఇలాంటి వినియోగం ప్రతీ ఏడాది పెరుగుతోంది. మరోవైపు కాక్రేన్ కొలాబరేషన్‌కు మనదేశం నుంచి సహకరించేవారు, రచయితలు, సంపాదకులు, సమీక్షలు జరిపేవారి సంఖ్య కూడా పెరుగుతోంది. ★

నిజాయితీ

ఒకసారి ఓరాజుగారికి పన్నులు వసూలు చేసే అధికారిని కొత్తగా నియమించాల్సి వచ్చింది. తగిన వ్యక్తిని ఎంపిక చేయమని ఆయన తన మంత్రిని కోరాడు. మంత్రి వివిధ వడపోతల తర్వాత తొమ్మిది మందిని ఎంపిక చేశాడు. ఆఖరి పరీక్ష ఇంకొకటుంది. అందులో ఎవరు విజయం సాధిస్తే వాళ్లనే అధికారిగా నియమిస్తారు. మంత్రి ఆ తొమ్మిది మందిని 'ఒక గదిలో నుంచి వెళ్లి మరొక గదిలోకి రమ్మన్నాడు. ఆ గదినిండా రకరకాల వజ్రవైఢూర్యాలు, మాణిక్యాలు, రత్నాలు రాసులుగా పోసివున్నాయి. తొమ్మిది మందీ ఆ గదిలో నుండి మరొక గదిలోకి వెళ్లారు. అక్కడ మంత్రి వున్నాడు. వాళ్లందరినీ నాట్యం చెయ్యమన్నాడు. అందులో ఒకతను సంతోషంగా ఎగురుతూ చక్కగా నాట్యం చేశాడు. మిగతా వాళ్లు నిశ్శబ్దంగా నిల్చున్నారు. ఎందుకంటే వాళు జేబుల నిండా బంగారు నాణాలు నింపుకున్నారు మరి. నాట్యం చెయ్యని వాళ్లందరూ మోసగాళ్లని, ధనాశకు లోబడతారని అర్ధమయింది. నాట్యం చేసిన వ్యక్తి నిజాయితీపరుడని తేలింది. అందుకే అతణ్ణే పన్నుల అధికారిగా నియమించాడు మంత్రి.

నీతి: నిజాయితీకి తగిన ఫలితం తప్పక దొరుకుతుంది.

[illegible] మదన్‌మోహన్

బాల కథ

బాలనేస్తాలు

వీరి వీరి గుమ్మడి పండు వీరిపేరేమి?

చెప్పుకోండి

హాయ్... పక్కనున్న పిడుగు ఎవరో తెలుసా? మీకు చిన్న క్లూ కూడా ఇస్తున్నాం. ఇతనో గొప్ప క్రీడాకారుడు. కాకపోతే చిన్ననాటి ఫొటో ఇది. ఇప్పుడు చెప్పండి ఇతను ఎవరో?

కిందకి చేరేదెలా!

బుజ్జాయిలూ...చూడండి! ఓ బుల్లి హీరో నిచ్చెన సహాయంతో గబగబా పైకి ఎక్కేశాడు. ఇప్పుడేమో కిందికి దిగి వెళ్లాలంటే దారి చాలా తికమకగా ఉంది. మీరు సాయం చేసి కిందికి చేర్చండే.



కనిపెడతారా!

నేస్తాలూ...ఇక్కడ కొన్ని వస్తువులు, తినుబండారాలు, జీవులు ఉన్నాయి.అవి పై బొమ్మలో ఎక్కడున్నాయో వెతికి పట్టుకోండి. ఎన్ని ఎక్కువ వెతికి పట్టుకుంటే అన్ని మార్కులు వచ్చినట్లు. మరి త్వరపడండీ!

ఏడు తేడాలు

పిల్లలూ... కిందున్న రెండు బొమ్మలూ చూడ్డానికి ఒకేలా ఉన్నాయి. కానీ వాటిలో ఏడు తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి.



సునయన

5వ తరగతి,
మాంటిస్సోరి
ఇంగ్లీషు మీడియంస్కూల్,
ఎల్.బి.ఎస్. నగర్,
ఇల్లెందు,ఖమ్మం.



రంగులు మార్చే కాకి

నేస్తాలూ! ఈ వారం మీ ముందుకు ఎవరొచ్చారో తెలుసా? గౌరుకాకి. ఇది మన దేశ పక్షి కాదు. కాకపోతే శీతాకాలంలో మనదేశం వలస వస్తుంది. వేసవి రాగానే తిరిగి తమ దేశానికి వెళ్తుంది. ఇది ఎక్కువగా నౌకాశ్రయాల దగ్గర, సముద్రతీరంలో కనిపిస్తుంది. అడవి కాకి కంటే కొంచెం పెద్దది. శరీర పైభాగం బూడిదరంగులో, కింది భాగం తెల్లగా ఉంటుంది. తమాషా ఏంటంటే దీని తల వేసవి కాలంలో చాక్లెట్ రంగులో, శీతాకాలంలో గోధుమరంగులోకి మారుతుంది. దీని ఆహారం చేపలు, మాంసపు తునకలు, చెత్తా, చెదారం. ఒకవేళ మాంసాహారం దొరకకపోతే అచ్చంగా శాకాహారం తోనే సరిపుచ్చుకుంటుంది. మీకు తెల్సా! ఇది గద్దలతో కూడా పోటీ పడుతుంది. అంతే కాదు! నీటి అలలమీద బాతులాగా ఈదుతుంది కూడా. ఇది బాగా ఎత్తైన ప్రదేశాల్లో, నీటి మొక్కలమీద మాత్రమే గుడ్లు పెడుతుంది. తడవకు రెండు మూడు గుడ్లకంటే ఎక్కువ పెట్టదు. ఈ గుడ్లమీద నలుపు, లేదా ఎరుపు కలిసిన గోధుమ రంగులో పెద్ద పెద్ద మచ్చలు గానీ, గీతలు, చుక్కలు గానీ ఉంటాయి.



ఏం చదువుతున్నారు?



ప్రస్తుతం వికాస్ కంటే వివేక్ రెట్టింపు తరగతి చదువుతున్నాడు. అయితే రెండేళ్ల క్రితం వికాస్ కంటే వివేక్ మూడు రెట్లు ఎక్కువ తరగతి చదువుతున్నాడు. ఇంతకీ వారిద్దరిలో ఎవరు ఏ తరగతి చదువుతున్నారు?

ఎన్ని కావాలి?

అక్కడ కొంతమంది పిల్లలున్నారు. వారిదగ్గర కొన్ని మామిడిపండ్లున్నాయి. వాటిని ఆ పిల్లలు తలా రెండు పండ్లు పంచుకుంటే ఒక మామిడిపండు తక్కువైంది. తలా ఒకటి పంచుకుంటే ఒక మామిడిపండు ఎక్కువ ఉంది? ఇంతకీ అక్కడున్న పిల్లలెంతమంది? మామిడిపండ్లు ఎన్ని?



జవాబులు

ఎవరు ఏం చదువుతున్నారు?: ప్రస్తుతం వివేక్ 8వ తరగతి చదువుతున్నాడు. వికాస్ 4వ తరగతి చదువుతున్నాడు. రెండేళ్ళక్రితం వివేక్ 6వ తరగతి, వికాస్ 2వ తరగతి చదివారు. **ఎన్ని కావాలి?:** ఇద్దరు పిల్లలు, మూడు మామిడిపండ్లు. **ఏడు తేడాలు:** 1.పాపకోటు ,2. ఎలుక, 3.పిల్లితోక, 4..వ్యాను తలుపు, 5.నిచ్చెన మెట్లు, 6.చెట్టుకొమ్మ తొర్ర, 7. గొడ్డలి. **ఎవరో తెలుసా?** : సచిన్ టెండుల్కర్

మాటల కోట - 51

రూపకల్పన : కర్లపాలెం

1	2		3	■	■	4		
■		■		■	■		■	■
5		■	6		7		■	8
9		10	■	■		■	11	
	■	12	13			■	14	
	■	15		■	■	16	■	
■	17	■	18	19	20		21	
22		■	■	23		■		■
24			■	■	25			

నిలువు :

2. అమ్మకాలు, కొనుగోళ్ల మధ్య సాగే వ్యవహారములు (4)
3. ఆ 'ఒక్కడు' తిరగబడ్డాడు (3)
5. తల్లి తరపు సంబంధం (4)
7. సైన్యం (3)
8. అన్నాడిఎంకె అధినేత్రి (5)
10. మాంగల్యవతి అయిన మహిళను ఇలా పిలుస్తుంటారు (3)
11. బెనారస్ (3)
13. కలలో మొదలయ్యే ఆందోళన (3)
17. జనలోక్‌పాల్ కోసం ఆందోళన చేసిన సామాజిక కార్యకర్త (3)
19. పళ్లనూరు! వంద కనబడుతుంది (2)
20. జలంలో ఉండే రక్తం పీల్చేజీవి (3)
21. వైయస్సార్ జిల్లా ఒకప్పుడు ఈ జిల్లానే (3)

అడ్డం :

1. ధనవంతుడు (4)
4. చాచానెహ్రూ కోటుమీది పువ్వు (3)
5. నేనుకి బహువచనం (2)
6. ఇద్దరి మధ్య జరిగే మాట కట్టుబడి (4)
9. నల్లధనంలో దాక్కున్న రంగు (3)
11. సీకాయ, జామకాయలో కామన్‌గా ఉండేది (2)
12. కనికరము లేకుండా పోయింది పోగా మిగిలింది (4)
14. రాయి (2)
15. ఆడవారికి సంబంధించిన (2)
16. పంది మైనస్ పది (2)
18. పాత హిందీ కథానాయిక. 'కూతురు' అని అర్థం కూడా (3)
21. కథ వికృతి (2)
22. సన్నటి మెడగల కడవ (2)
23. ముందూవెనుక లేని చారులత (2)
24. ఇవివి సత్యనారాయణ గారి అల్లరి కొడుకు (3)
25. చిలకమర్తి నరసింహం గారి హాస్య నవల (4)

మాటలకోట - 50 జవాబు

■	■	1 బా	2 కా	■	3 పే	4 ట	■	■
■	■	5 బా	రు	■	6 ద	బ్	■	■
7 మూ	డు	■	మం	■	క	■	8 వే	లు
■	■	9 స	చి	10 వా	ల	యం	■	■
11 డు	12 పాం	■	■	ణి	■	■	13 ఇ	ల్లు
■	14 చా	15 వి	డి	■	16 మీ	17 టిం	గు	■
18 క	లి	మూ	■	19 సీ	■	20 గు	రు	తు
■	■	21 న	22 రా	వ	23 తా	రం	■	■
■	■	24 ము	ళ్లు	■	25 నా	గ	■	■

రైతు - గుర్రం



చాలాకాలం క్రితం ఒక ఊళ్లో ఓ రైతు ఉండేవాడు. అతని దగ్గర ఒక గుర్రం ఉండేది. ఆ గుర్రం అంటే రైతుకు చాలా ఇష్టం. దాన్ని ఎంతో బాగా చూసుకునేవాడు. ప్రతి రోజూ దాన్ని చెరువుకు తీసుకుపోయి స్నానం చేయించేవాడు. కడుపునిండా మేత పెట్టేవాడు. అది కూడా యజమాని పట్ల విశ్వాసంగా ఉండేది. యజమానిని జాగ్రత్తగా తీసుకుని పోయేది.

ఓ రోజు రైతు పని మీద గుర్రం ఎక్కి పక్క ఊరికి వెళ్లాడు. అక్కడ ఒక ఇంటి ముందున్న చెట్టుకు గుర్రాన్ని కట్టేసి ఇంట్లోకి వెళ్లాడు. ఆ ఇంటి యజమానితో మాటల్లో పడ్డాడు. అదే సమయంలో ఆ దారిన వెళ్తున్న ఓ షావుకారు గుర్రాన్ని చూసి ఆశ్చర్యపోయాడు.

చక్కగా ఆరోగ్యంగా, అందంగా ఉన్న ఆ గుర్రం తన దగ్గర ఉంటే ఎంత బాగుంటుంది అనుకున్నాడు.

అంతేకాకుండా అతని మనసులో గుర్రాన్ని ఎలాగైనా సొంతం చేసుకోవాలన్న దుర్బుద్ధి పుట్టింది. మరుక్షణం అటూ ఇటూ చూశాడు. ఎవరూ గమనించడం లేదని నిర్ధారించుకుని గుర్రం కట్లు విప్పి దాన్ని ఎక్కి అదిలించాడు.

గుర్రం కదల్లేదు. షావుకారు గట్టిగా ఒక దెబ్బ వేశాడు. గుర్రం సకిలించి ముందుకు కదిలింది. దాని సకిలింపు విన్న రైతు చప్పున ఇంట్లో నుండి బయటికి వచ్చాడు. తన గుర్రాన్ని ఎవరో తీసుకుపోతుండడం చూసి ఆశ్చర్యపోయాడు. వెంటనే గట్టిగా కేకలు పెడుతూ దాని వెంట పడ్డాడు.

విశ్వాసం గల గుర్రం, యజమాని కంఠాన్ని గుర్తుపట్టి మెల్లగా పరుగెత్తసాగింది. షావుకారు దాన్ని ఎంత అదిలించినా అది వేగం పెంచలేదు.

అంతలో రైతు అక్కడికి చేరుకున్నాడు. రైతు అరుపులు విని దారిన వెళ్తున్నవారు కూడా అక్కడికి చేరుకున్నారు.

"ఏమయ్యా షావుకారు? ఇదేం దొంగబుద్ధి నీకు?" అన్నాడు రైతు.

"నేను దొంగనా? ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడు" అన్నాడు షావుకారు కోపం నటిస్తూ.

"నా గుర్రాన్ని తీసుకుని పారిపోయేవాడ్ని దొంగ అనకుండా ఏమనాలి మరి?" ఆవేశంగా అన్నాడు రైతు.

"నీ గుర్రమా? నీలాంటి మామూలు రైతుకు గుర్రం కూడానా? నేను షావుకారును. ఇది నా గుర్రం" అన్నాడు షావుకారు.

గుర్రం నాదంటే నాదని ఇద్దరూ వాదులాడుకోసారు.

ఆ దారిన వెళ్తున్న జనాలు మరికొంతమంది అక్కడికి చేరారు. వారిలో గ్రామపెద్ద కూడా ఉన్నాడు. వారి తగాదా చూసి ఏమిటని ప్రశ్నించాడు. ఇద్దరూ విషయం చెప్పారు. గ్రామపెద్ద ఆలోచనలో పడ్డాడు. ఇద్దరూ ఆ వూరివారు కాదు. ఇద్దరిలో ఒకరు సాధారణ రైతు. మరొకరు షావుకారు. తీర్పు ఏమని చెప్పాలో తోచలేదు ఆయనకు.

అదే సమయంలో రైతు మనసులో ఓ ఆలోచన తళుక్కున మెరిసింది. వెంటనే తన భుజం మీద కండువా తీసి గుర్రం ముఖంమీద కప్పాడు. అది చూసి అందరూ ఆశ్చర్యపోయారు. అప్పుడు రైతు గ్రామ పెద్దతో "అయ్యా! షావుకారు ఈ గుర్రాన్ని తనదంటున్నారు. అదే నిజమైతే తన గుర్రానికి ఏ కన్ను గుడ్డిదో చెప్పమనండి" అన్నాడు.

షావుకారు తికమక పడ్డాడు. అయితే తన తడబాటును కప్పిపుచ్చుకుంటూ "ఎడమ కన్ను" అన్నాడు.

రైతు నవ్వుతూ గుర్రం ముఖం మీద కప్పిన కండువాను తీశాడు. గుర్రాన్ని బాగా చూసిన జనానికి నిజమేమిటో తెలిసింది.

రైతు గ్రామపెద్దను చూస్తూ "అయ్యా! షావుకారు గుర్రం గుడ్డిదట. నా గుర్రం గుడ్డిది కాదు. పరీక్షించి మీరే న్యాయం చెప్పండి" అన్నాడు.

గ్రామ పెద్ద "షావుకారుగారూ! మీలాంటి పెద్దలే ఇలాంటి తప్పులు చేస్తే ఎలా? ఇది రైతు గుర్రం. మీరు దుర్బుద్ధితో దాన్ని కాజేయాలనుకున్నారు. అయితే ఈ రైతు తన తెలివితేటలతో మీ బండారం బయటపెట్టాడు. మీ తప్పుకు శిక్షగా గుర్రానికి నెలరోజుల దాణాకు అయ్యే ఖర్చు కింద ఐదు వరహాలు మీరు రైతుకి చెల్లించాలి" అంటూ తీర్పు చెప్పాడు.

షావుకారు సిగ్గుతో తల వంచుకుని ఐదు వరహాలు చెల్లించాడు.

అక్కడ చేరిన జనం రైతును అభినందిస్తూ, షావుకారుకు తగిన శిక్ష పడినందుకు ఆనందంతో చప్పట్లు కొట్టారు.

రైతు తన గుర్రాన్ని ప్రేమగా నిమిరి దాని మీద ఎక్కి "పద పదవే పంచకళ్యాణి గుర్రమా" అని పాట పాడాడు.

గుర్రం సంతోషంతో గంతులు వేస్తూ ముందుకు ఉరికింది.

- రంగనాథ రామచంద్రరావు



శునకమైనా కాకపోతిమే...

ఒక్కోసారి అనిపిస్తుంది 'మనం అలా ఎందుకు కాలేదు?' అని.
విషయం తెలిస్తే మాత్రం కుక్క అయినా కాకపోతిమే అనిపించకమానదు.
'ఛ..మేం కుక్క కావడమా! ఛస్తే అనుకోం' అంటారా! అయితే పందెంలో ఓడిపోతారు. మరోసారి
ఆలోచించుకుంటే మంచిది. ఆలోచించే ప్రసక్తే లేదంటారా! ఆనక మీ ఇష్టం.

ఇదిగో చూడండి! ఫొటోలో కనిపిస్తోందే!! ఈ శునకం ప్రపంచంలోకెల్లా అదృష్టవంతురాలు. ఎలాగంటారా! ఇది 5 ఖండాలు, 25 దేశాలు చుట్టి వచ్చిందండీ. మరి అంత అదృష్టం మానవమాత్రులమైన మనకే కలగలేదు. కానీ అది కక్కె వుండి దేశదేశాలు పర్యటించింది. మరి అదృష్టమంటే దానిదేకదా. ఇంతకీ ఆ శునకం పేరేంటంటే ఆస్కార్. దాని యజమానురాలు జానీ లెప్సన్. ఆమెకు ఓసారి ఓ మెరుపు ఆలోచన వచ్చింది. అదేమంటే వున్న ఇంటిని అమ్మేసి పెంపుడు కుక్కతో సహా ప్రపంచ పర్యటన చేస్తే ఎలా వుంటుంది? అని. అంతే ఆలస్యం అమృతం విషం అన్నట్లు తక్షణం అనుకున్న పని చేసేసింది. చక్కగా ఆస్కార్‌తో కలిసి చూడాలనుకున్న ప్రదేశాలన్నీ చూసేసింది. మీకింకా నమ్మశక్యంగా లేదా! అయితే హాలీవుడ్, ఈజిప్ట్, న్యూయార్క్‌లో స్వేచ్ఛా ప్రతిమ, గ్రేట్ వాల్ ఆఫ్ చైనా, ఇండియాలో తాజ్‌మహల్....వంటి పలు ప్రసిద్ధ ప్రదేశాల ముందర నిలబడి ఫొటోలకు ఇచ్చిన ఫోజులనే మీ ముందుంచాం. మరి తిలకించి పులకించండి.